వార్తా పత్రికలు,
అధిక సంఖ్యలో పుస్తకముల ముద్రణ కోసం సంప్రదించండి.
9393949345.
విశాఖ సమాచారమ్ ప్రెస్
మల్టీకలర్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

మీ లక్ష్మీ దీపపు ఒత్తులు
కార్తీక దామోదర స్వామి కొరకు
ఆర్డర్ చేయండి
నేరుగా మీ ఇంటికే అందించ
బడతాయి
పువ్వు ఒత్తులు..కాడ
ఒత్తులు..365
ఒత్తులు..కమలం ఒత్తులు
9248547596 కౌశికోటి
Speed Post and APSRTC
DOOR DELIVERY....48 to
72 hours లో

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 39 విశాఖపట్నం, 15 నవంబరు 2022 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## బలవంతపు, మోసపూరిత మతమార్పిళ్లు తీవ్రమైన అంశమే : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: భారతదేశంలో బలవంతపు, మోసపూరిత మతమార్పిడులపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. కొన్ని చోట్ల జరుగుతున్న బలవంతపు మతమార్పిడులు చాలా తీవ్రమైన అంశమని, వాటిని గురించి నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించింది. ఇలాంటి పరిస్థితిని అరికట్టకపోతే అత్యంత క్లిష్టమైన పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించింది.

దేశంలో బలవంతపు, మోసపూరిత మత మార్పిళ్లను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలని ప్రముఖ న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ హిమా కోహ్లీ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేసింది.

బలవంతపు మతమార్పిళ్లు చాలా తీవ్రమైన అంశమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.వీటిని అరికట్టేందుకు కేంద్రం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించింది. లేదంటే చాలా క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొంది. దేశ భద్రత, మత స్వేచ్ఛను ప్రభావితం చేసే సమస్య అని, అందువల్ల కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీనిపై చర్యలు చేపట్టాలని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

## ఆదాయార్జనల శాఖలపై జగన్ కీలక సమీక్ష



ఏపీలో వైసీపీ మూడున్నరేళ్ల పాలనలో సంక్షేమం కోసం పెడుతున్న ఖర్చు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఆదాయం అవసరం కూడా అంతే స్థాయిలో పెరుగుతోంది. దీంతో సీఎం జగన్ తరచుగా ఆదాయాన్ని అర్జించే శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అలాగే అధికారులకు కీలక సూచనలు కూడా చేస్తున్నారు. ఇవాళ మరోసారి ఆదాయార్జన శాఖలపై జగన్ కీలక సమీక్ష చేశారు.

సోమవారం వాణిజ్య పన్నులశాఖ అధికారులతో జరిగిన సమీక్షలో అధికారులు పన్ను చెల్లింపుదారులకు మరింత అవగాహన కలిగించాలని సీఎం జగన్ సూచించారు. ఏపీలో అన్ని రంగాల్లో స్నేహపూర్వక వాతావరణం ఉందన్న విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న ఏజెన్సీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

అందుబాటులో ఉన్న సమాచారం మేరకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పన్ను చెల్లింపుదారులకు చెల్లింపుల ప్రక్రియను మరింత సౌలభ్యంగా చేయాలని జగన్ ఆదేశించారు. అవగాహన పెంచడం, వారి అభ్యంతరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం చేయాలన్నారు. దీనివల్ల చెల్లింపులు సకాలంలో జరుగుతాయని, పన్ను కట్టేవారికి కూడా చక్కటి సేవలు అందించినట్టు అవుతుందన్నారు. అలాగే ట్రేడ్ అడ్వైజరీ కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు.

అనంతరం ఎక్సైజ్ శాఖపైనా సీఎం జగన్ సమీక్ష చేశారు. గతంతో పోల్చి చూస్తే మద్యం అమ్మకాలు తగ్గాయని, బెల్టుషాపులు తొలగించడం, పర్మిట్ రూమ్‌లు రద్దు వంటి ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల నియంత్రణ చర్యల వల్ల అమ్మకాలు గణనీయంగా తగ్గాయని సీఎం తెలిపారు. రేట్లు పెంచడం వల్ల కూడా మద్యం వినియోగం తగ్గిందని వెల్లడించారు. అక్రమ మద్యం తయారీ, అమ్మకాలపై ఎస్ఈబీ ప్రత్యేక దృష్టి సారించాలని జగన్ ఆదేశించారు.

వాటిని నివారించడానికి తనిఖీలు ముమ్మరం చేస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఎస్ఈబీలో పరివర్తన కార్యక్రమం జరుగుతున్న తీరుపై సీఎం వివరాలు తెలుసుకున్నారు. పరివర్తన కార్యక్రమంలో చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీసారు. చేయూత, ఆసరా వంటి కార్యక్రమాలు ద్వారా వారికి ఊతమివ్వాలన్నారు. ప్రత్యామ్నాయ జీవనోపాధిని కల్పించాలని ఆదేశించారు. వారికి ఆదాయాలు వచ్చే దిశగా ఉపాధి ఉండాలన్నారు. అప్పుడే మరలా అక్రమ మద్యం తయారీ వంటి కార్యక్రమాలకు దూరంగా ఉంటారన్నారు.

ఆ తర్వాత రిజిస్ట్రేషన్ శాఖపైనా సీఎం జగన్ సమీక్ష చేశారు. శాశ్వత భూహక్కు, భూసర్వే కార్యక్రమం చేపడుతున్న గ్రామాల్లో.. వార్డుల్లో...సబ్ రిజిస్ట్రార్ భవనం, సేవలు వంటి వాటిపై

(మిగతా 2లో)

## అందమైన భవిష్యత్తుకు బాటలు వేయండి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అందమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి విద్యార్థులను నేటి నుంచి కృషిచేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన స్వాగత సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఆలోచనలే నేటి తరానికి నిజమైన పెట్టుబడిగా నిలుస్తాయన్నారు. ప్రతీ విద్యార్థి ఉపాధి అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో విశ్వవిద్యాలయం పనిచేస్తున్న విధానం వివరించారు. ఏయూలో ఇంక్యుబేషన్, స్టార్టప్, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ విశ్వవిద్యాలైన మిస్సోరి, యూనివర్సిటీ ఆఫ్ వెస్టన్ ఆస్ట్రేలియా, పర్డు యూనివర్సిటీతో అవగాహన ఒప్పందాలు చేసుకుని సంయుక్తంగా కోర్సుల నిర్వహణ చేపడతామన్నారు. అనుభవపూర్వక విద్యను అందించడానికి వర్సిటీ పూర్తిస్థాయిలో కృషిచేస్తున్న విధానం తెలియజేశారు.

విద్యార్థులు ఆల్‌రౌండ్ స్కిల్స్‌ను పెంపొందించుకునే ప్రయత్నం చేయాలన్నారు. కోర్ బ్రాంచ్‌ల విద్యార్థులకు సైతం ఐటి కోర్సులను భాగం చేస్తున్నామన్నారు. గ్రీన్ కెమిస్ట్రీ, ఇండస్ట్రీ 4.0 అంశాలను సిలబస్‌లో చేర్చడం జరిగిందన్నారు. భయంలేని అభ్యసన వాతావరణాన్ని ఏయూలో అందిస్తామన్నారు. సృజనాత్మకంగా ఆలోచన చేస్తూ పనిచేయాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు సౌండ్ ఇంజనీరింగ్ వంటి మనసుకు నచ్చిన కోర్సులు చేసే అవకాశం కల్పిస్తామన్నారు.

**మి అండ్ మై ప్లాంట్....**

ప్రథమ సంవత్సరంలో చేరిన ప్రతీ విద్యార్థి ఒక మెక్కను నాటి సంరక్షించే బాధ్యత స్వీకరించాలని

(మిగతా 2లో)

## దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యాలయానికి గ్రీన్‌సిగ్నల్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యాలయానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విశాఖపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.106 కోట్లతో జోన్ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. తొలిదశలో పాత వైర్‌లెస్ కాలనీలో 13 ఎకరాల్లో జోన్ కోసం భూసేకరణ చేయనున్నారు. 8 ఎకరాల్లో మల్టీ స్టోరీడ్ భవనాల నిర్మాణం చేపట్టనున్నారు. విశాఖ రైల్వే స్టేషన్ ఆధునీకరణ కోసం కేంద్రం రూ.456 కోట్లను మంజూరు చేసింది. అదనంగా మరో రెండు రైల్వే ప్లాట్‌ఫామ్‌ల ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను పంపించింది.

## అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని , ఎట్టి పరిస్థితుల్లోను రీ ఓపెన్ కాకూడదని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారం మరియు పలు విషయాల పై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వివిధ సమస్యలపై ప్రజల నుండి స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత సమయంలో పరిష్కరించాలన్నారు. స్పందన అర్జీలు ఎట్టి పరిస్థితుల్లోనూ రీ ఓపెన్ కాకూడదని, కాలపరిమితిలోగా దరఖాస్తులన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. వచ్చిన అర్జీలను కాలపరిమితిలోగ పరిష్కరించిన తరువాత దాని యొక్క ఫోటోను స్పందన పోర్టల్ లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన పనులను ప్రాధాన్యత అంశం వారీగా తక్షణమే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించి పూర్తి చేయాలని జీవీఎంసీ, పంచాయితీరాజ్, ఎంపీడీఓ లను ఆదేశించారు. అదేవిధంగా హౌసింగ్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. టిడ్కో ఇండ్ల పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఖాళీగా ఉన్న గ్రామ, వార్డు వాలంటీర్స్ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తులను త్వరతగతిన పరిశీలించాలి.

జిల్లాలో ఎమ్మెల్సీ ఓటు నమోదు కొరకు దరఖాస్తులను త్వరతగతిన పరిశీలన చేయాలని తహశీల్దార్లు, ఎంపీడీవో లు, జోనల్ కమీషనర్లు ఏఈఆర్వోలు లను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఓటు కొరకు 2,69,000 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు.

**కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించే ఇంటింటి సర్వే:** జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనలో భాగంగా ఈ నెల 15 నుండి డిసెంబర్ 5 వరకు కుష్టు వ్యాధిపై శిక్షణ , అవగాహన మరియు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానిత లక్షణాలు ఉన్న ఎడల ఇంటి వద్దకు ఆరోగ్య కార్యకర్తలు వచ్చినపుడు

(మిగతా 2లో)



ప్రధాని మోడీని కలిసిన మాజీ లోక్‌సభ సభ్యులు కొత్తపల్లి గీత

## పారిశ్రామిక నగరంగా అనకాపల్లి, అచ్చుతాపురం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అచ్చుతాపురం ప్రాంతం పారిశ్రామిక నగరంగా ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రంలో నిలుస్తుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చెప్పారు. సుమారు 300 కోట్ల రూపాయల వ్యయంతో ఎలమంచిలి నియోజకవర్గంలోని పూడి గ్రామంలో 15.76 ఎకరాల్లో చైనాకు చెందిన యమా రిబ్బన్స్ కంపెనీ నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే స్టీల్ ప్లాంట్, హెచ్పీసీఎల్, షిప్ యార్డ్, బిహెచ్ఇఎల్ వంటి అనేక భారీ పరిశ్రమలతో పెద్ద పారిశ్రామిక నగరంగా విశాఖ వెలుగొందుతోందని, ఇదే సమయంలో అచ్యుతాపురం సెజ్ లో మరిన్ని పరిశ్రమలు కార్యకలాపాలు ప్రారంభిస్తున్నాయని దీనికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి




పారిశ్రామిక ప్రగతికి అనుగుణంగా తీసుకుంటున్న నిర్ణయాలే కారణమని అన్నారు. 300 కోట్ల రూపాయల పెట్టుబడితో నెలకొల్పనున్న యమా రిబ్బన్స్ కంపెనీలో రెండు వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని మంత్రి తెలియజేశారు. 1500 కోట్ల రూపాయలతో ఏర్పాటుచేసిన ఏ సిటీ టైర్ల కంపెనీ వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించిందని ఆయన తెలియజేశారు. అచ్చుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి నుంచి కాకినాడ వరకు పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తోందని అన్నారు. ఆంధ్రప్రదేశ్లో 25 వేల ఎకరాల పారిశ్రామిక భూమి అందుబాటులో ఉందని ఎన్ని పరిశ్రమలు వచ్చిన వాటికి భూమి కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని అన్నారు. యమ రిబన్స్ కంపెనీ వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి కార్యకలాపాలు ప్రారంభిస్తున్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. ఈ కంపెనీలో మహిళలకు అధిక సంఖ్యలో ఉద్యోగాలు లభించనున్నాయని అని చెప్పారు. జనాభా విషయంలో చైనా, భారతదేశం దాదాపు ఒకే విధంగా ఉందని, సాంకేతిక రంగంలో కూడా ఇరుదేశాలకు చెందిన వారు ప్రపంచంలోని అనేక ముఖ్య నగరాల్లో విధులు నిర్వహిస్తున్నారని విషయాన్ని మంత్రి అమర్నాథ్ గుర్తు చేశారు. పీఎం మిత్ర స్కీమ్ ని ఆంధ్రప్రదేశ్లో కూడా అమలు చేయాలని సమావేశానికి హాజరైన సెంట్రల్ టెక్స్టైల్స్ డైరెక్టర్ అనిల్ కుమార్ కు అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా, త్వరలోనే పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి త్వరలోనే శంకుస్థాపన చేయనున్నారని మంత్రి అమర్నాథ్ తెలియజేశారు.

అనకాపల్లి

(మిగతా 2లో)

## ఆరు నెలలు కృషి చేస్తే మార్పు వస్తుంది



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** అంగన్వాడి కేంద్రాల సిబ్బంది, సూపెర్వైజర్లు,సిడిపిఓలు, మహిళా పోలీసులు ఒక ఆరు నెలల పాటు గట్టిగా కృషి చేస్తే మార్పు వస్తుందని కలెక్టర్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అరకు నియోజక వర్గం పరిధి లోని ఐసిడిఎస్ అధికారులు, మహిళా పోలిస్ లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, సచివాలయాలలో మహిళా పోలీస్ పాత్ర చాలా ముఖ్యమైనదని, వారు డీలర్ల రేషన్ షాపులు, ఎం.ఎల్.ఎస్ పాయింట్లు సందర్శించాలని, అంగన్వాడి సూపెర్వైజర్లు, ఆయాలు, హేల్పర్లకు సహకరించాలని సూచించారు. డీలర్లు అంగన్వాడి కేంద్రాలకు సక్రమంగా సరుకు పంపిణీ చేయటం లేదనే ఆరోపణలు, గర్భిణీలు ప్రసవాలకు ఆసుపత్రులకు రావటం లేదనే అంశాలపై కలెక్టర్ పై విధంగా స్పందించారు. జిల్లాలో బరువు, ఎత్తు తక్కువున్న పిల్లలు, హై రిస్క్ గర్భిణీలు, రక్త హీనత తో భాద పడేవారు ఎక్కువగా ఉన్నారని, అటువంటి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. ఆరు నెలల నుండి 36 నెలల పిల్లలకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రక్త హీనత తో బాధ పడుతున్న వారిని, హై రిస్క్ గర్భినీలను గుర్తించి వారికి సరైన అవగాహన కల్పించాలని, క్రమం తప్పకుండా వారిని ట్రాక్ చేయాలని, వారి భర్తలతో మాట్లాడి పౌష్టికాహారం తీసుకోనేల చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ నెలలో కుడా అంగన్వాడి కేంద్రాలలో స్టాక్ ఉండకూడదని, ఎవరి రేషన్ వారికి ఇంటికే అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లాలో అధికంగా యువ మహిళా పోలీసులు ఉన్నందున గిరిజన గర్భిణీ, బాలింతల భాద్యతను వారు తీసుకోవాలని సూచించారు. ఇంట్లో వారికి సేవలు అందించే విధంగానే వారికి కూడా సేవలందించాలన్నారు. మాత, శిశు మరణాల నివారణలో మహిళా పోలిస్ పాత్ర

(మిగతా 2లో)

(మొదటి పేజీ తరువాయిలు)

### ఆదాయార్జనల శాఖలపై జగన్ కీలక సమీక్ష

అవగాహన కలిగించాలని జగన్ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఈ దిశగా ఓరియెంటేషన్ అందించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయాల పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో...ఏయే రకాలడాక్యుమెంట్లు ను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్న విషయాలపై ప్రజలకూ అర్థమయ్యేలా వివరించాలన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. అనంతరం మైనింగ్ శాఖపై సమీక్ష చేసిన జగన్...నాన్ ఆపరేషనల్ మైన్స్‌పై మరింత దృష్టి పెట్టాలన్నారు. నిరుపయోగంగా ఉన్న మైనింగ్ ఏరియాలో కార్యకలాపాలు మొదలయ్యేలా చూడాలన్నారు.

### అందమైన భవిష్యత్తుకు బాటలు వేయండి

సూచించారు. మెక్కను, ట్రీ గార్డ్‌ను ఏయూ అందిస్తుందన్నారు. విద్యార్థి నాటి సంరక్షించిన మెక్కవద్ద వారి పేర్లు పెడతామన్నారు.

కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, విభాగాధిపతులు పాల్గొన్నారు. విద్యార్థులకు విభాగాల వారీగా కోర్సులపై అవగాహన కల్పించారు.

### అర్జీలను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలి

చుపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముందుగా కలెక్టర్ జిల్లాలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పర్యటన ను విజయవంతం చేసినందుకు అందరు అధికారులకు, సిబ్బందికి పేరు, పేరు న అభినందనలు తెలియజేశారు.

తదుపరి కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ప్రజలనుండి విజ్ఞప్తులు స్వీకరించారు.

సోమవారం స్పందన కార్యక్రమంలో 230 విజ్ఞప్తులు అందాయి.

ఈ స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ , జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ , జీవీఎంసీ అదనపు కమిషనర్ వర్మ , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పారిశ్రామిక నగరంగా అనకాపల్లి, అచ్చుతాపురం

ఎంపీ సత్యవతమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం గత మూడు సంవత్సరాల నుంచి ఈచ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో నెంబర్ వన్ స్థానంలో ఉందని, సింగల్ విండో విధానంలో పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే యు.వి. రమణ మూర్తి రాజు మాట్లాడుతూ ఈ ప్రాంతానికి వచ్చే కొత్త కంపెనీలు అన్నిటికీ పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏర్పడిన ఈ సెజ్ లో అనేక కంపెనీలు వస్తున్నాయని ఆయన చెప్పారు. టెక్స్టైల్స్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ యమ రిబ్బన్స్ కంపెనీ 2000 మందికి ప్రత్యక్షంగాను, మరో 2000 మందికి పరోక్షంగాను ఉపాధి కల్పించడం ఉందని ఆయన చెప్పారు.

చైనా జనరల్ కాన్సులేట్ జాలియో మాట్లాడుతూ కంపెనీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని కొనియాడారు. వ్యాపార, వాణిజ్య రంగాలలో భారత్, చైనా సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యమ ఇండియన్ హెడ్ స్టీవ్ , ఏపీఐఎస్సి జెడ్ ఎం త్రినాధ్, యమ రిబ్బన్స్ కంపెనీకి చెందిన ప్రజలు పాల్గొన్నారు.

### ఆరు నెలలు కృషి చేస్తే మార్పు వస్తుంది

కీలకమన్నారు. అదే విధంగా సచివాలయాలలో ఉన్న వాలంటీర్ల సహాయంతో ఇంటికి రేషన్ పంపించాలన్నారు. వారు అంగన్వాడి కి రానంత మాత్రాన వారికి పౌష్టికాహారం అందకుండా పోరాదని, తద్వారా వారు రక్త హీనతకు గురి కారాదని హితబోద చేసారు. రాలేకపోయిన గర్భిణీలు, బాలింతలకు వారి ఇంటికే పౌష్టికాహారం పంపించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.

సచివాలయ సందర్శనలో మహిళా పోలీసులు గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న సేవలపై రికార్డులు తనిఖీ చేస్తానని ప్రతి ఒక్కరు అందుకు సంబంధించిన రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. పరిశీలనలో లోపాలు కనబడితే సంబంధిత వ్యక్తులకు షోకాజ్ నోటీసు బదులు వారి వారి సర్వీస్ రిజిస్టర్లలో రెడ్ మార్క్ ఎంట్రీ నమోదు చేస్తానని హెచ్చరించారు. ఎస్ పి సమీక్షలలో కూడా మహిళా పోలీసులకు సూచనలు జారీ చేయిస్తామన్నారు.

ఎం.డి.యు. వాహనాల ద్వారా అంగన్వాడి కేంద్రాలకు రేషన్ సరఫరా చేయాలని, అంగన్వాడి కేంద్రాలకు రాని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో, సర్పంచ్ తో మాటాడి వారిని రప్పించాలని, రాని పిల్లలకు పాలు, గుడ్లు పంపించాలని ఆదేశించారు. తద్వారా వారి ఆరోగ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని, అందుకోసమే మీ జాబ్ అనే విషయం గుర్తించాలన్నారు. ప్రతి సుపెర్వైజర్ వీలైనన్ని అంగన్వాడి కేంద్రాలు సందర్శించాలని ఆదేశించారు. మహిళా పోలీసులు మారుమూల ప్రాంతాలను కూడా సందర్శించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, ఐసిడిఎస్ పథక సంచాలకులు సూర్య లక్ష్మి, అరకు నియోజక వర్గం పరిధిలోని అనంతగిరి, అరకు, దుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచింగిపుట్టు మండలాల ఎంపిడిఒలు, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపెర్వైజర్లు, ఆయా మండలాల మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్రకు నిలయాలు గ్రంథాలయాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** చరిత్ర గురించి తెలుసుకోవాలన్నా, వివిధ అంశాలపై విజ్ఞానాన్ని సంపాదించాలన్న గ్రంథాలయాల్లోనే సాధ్యమవుతుందని రాష్ట్ర పరిసరమైన శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించునున్న 55వ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక ఉడా చిల్డ్రన్ థియేటర్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అమర్నాథ్ మాట్లాడుతూ " చిరిగిన చొక్కా అయినా తొడుక్కో.. కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో" అంటూ కందుకూరి వీరేశలింగం పంతులు మాటలను ఉటంకిస్తూ.. పుస్తకానికి ఉన్న బలం చాలా గొప్పదని పేర్కొన్నారు. పుస్తకం చేతిలో ఉంటే ప్రపంచాన్ని ఏలవచ్చని అమర్నాథ్ అన్నారు. గ్రంథాలయాల కోసం అనేక పోరాటాలు ఉద్యమాలు జరిగాయి. ఉద్యమంలో అనేక మహా అనేకమంది మహానుభావుల పోరాట పటిమలను మనం చూసాం. అప్పటి పెద్దల ఆలోచన విధానం వల్లే నేడు దేశంలో వేలాది గ్రంథాలయాలు వెలిశాయని ఆయన అన్నారు. సాంకేతిక విజ్ఞానం పెరగడంతో అందరూ సెల్ ఫోన్ల ద్వారా వివిధ సమాచారాన్ని తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. గ్రంథాలయాల్లో దానికన్నా విలువైన సమాచారం ఉందన్న విషయాన్ని అమర్నాథ్ గుర్తు చేశారు. గ్రంథాలయాలకు వెళ్లడం వల్ల వివిధ రకాల పుస్తకాలతో పాటు నిన్న సంస్కృతులు సంప్రదాయాలు కలిగిన వ్యక్తులతో పరిచయాలు కూడా ఏర్పడతాయని చెప్పారు. " ఏ స్థలం ఎక్కడ ఉందో తెలియకపోయినా.. గ్రంథాలయం ఎక్కడ ఉందో తెలుసుకో" అన్న ఐనస్టీన్ మాటలను మంత్రి అమర్నాథ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గ్రంథాలయాలు జ్ఞానానికే కాదు మానసిక ఉల్లాసరికి కూడా ఉపయోగపడతాయని ఆయన చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రంథాలయాల్లో నేర్చుకోవాల్సింది చాలా ఉందని ఆయన చెప్పారు. విద్యా వ్యవస్థలు సమూల మార్పులు తెచ్చేందుకు రాష్ట్రంలో 15 వేల కోట్ల రూపాయలతో నాడు నేడు పథకం కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలియజేశారు. నేడు కార్పొరేట్ స్కూల్స్కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య బోధన సాగుతోందని ఆయన చెప్పారు. ఉన్నత శిఖరాలను చేరుకోవాలని లక్ష్యంతో చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం ఎటువంటి సహాయమైనా అందిస్తుంది ఆయన చెప్పారు. విశాఖ నడిబొడ్డున ఉన్న సుమారు ఎకరం స్థలంలో అత్యాధునిక గ్రంథాలయాన్ని నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. చాలాకాలంగా ఈ స్థలం ఆర్మ్డ్ ఫోర్స్ అధీనంలో ఉండేదని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్లమెంటరీ పార్టీ నాయకులు విజయసాయిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ కొండా రమాదేవి చొరవతో తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని మంత్రి అమర్నాథ్ తెలియజేశారు. ఈ గ్రంథాలయ నిర్మాణానికి అయ్యే ఖర్చులో భాగం వివిధ పారిశ్రామిక సంస్థలు చెల్లించే విధంగా తాను చర్యలు తీసుకుంటానని అమర్నాథ్ వెల్లడించారు. అదేవిధంగా గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ నుంచి జిల్లా గ్రంథాలయ సంస్థకు 120 కోట్ల రూపాయల నిధులు రావాల్సి ఉందని, నెలకు 50 లక్షల రూపాయలు చొప్పున చెల్లించే విధంగా ఆదేశాలు జారీ చేయడం పట్ల మంత్రి అమర్నాథ్ హర్ష వ్యక్తం చేశారు.

జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున మాట్లాడుతూ దేశమంతా పిల్లలు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. గ్రంథాలయల యొక్క ప్రాముఖ్యతను పిల్లలకు చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు . బాలల కోసం గ్రంథాలయ వారోత్సవాలు జరపడం మంచి శుభ పరిణామన్నారు. మన దగ్గర ఉన్న పుస్తకాలే కాకుండా గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను కూడా పఠనం చేయాలన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ కొండా రమాదేవి మాట్లాడుతూ సమాజ వికాశంలో గ్రంథాలయాల ప్రాధాన్యతను తెలియజేసేందుకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలు టీవీలు, ఫోన్ లకు పరిమితం కాకుండా పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పెద్దవారు కూడా పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవడమే కాకుండా పిల్లల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, తిప్పల నాగిరెడ్డి, డిఇఓ చంద్రకళ, వివిధ కార్పొరేషన్ చెర్మన్ లు, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు గ్రంథాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనం... జీవితం మార్పుకు నాంది




**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పుస్తక పఠనం జీవితం మార్పుకు నాంది అని జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి డా. యం.వి.ఆర్. కృష్ణాజి అన్నారు. పుస్తక పఠనంతో విద్యార్థులలో విజ్ఞానం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సోమవారం గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణా జి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గ్రంథాలయాలు స్థాపించి వంద సంవత్సరాలు దాటిందన్నారు. ఎంతో మంది విద్యార్థులు గ్రంథాలయాలలోని పుస్తకాలు చదివి గొప్ప స్థాయికి వెళ్లారని చెప్పారు. ప్రతీ ఒక్కరు పుస్తకం చదవాలని దాని వల్ల పరిజ్ఞానం మెరుగుపడుతుందని సూచించారు. ఒక కుగ్రామంలో ఉండే వ్యక్తి తినడానికి తిండి కూడా లేని స్థితి నుండి, ఈ రోజు అమెరికా లో ఫార్మా కంపెనీ చీఫ్ సైటిస్ట్ గా పని చేసే స్థాయికి ఎదిగాడని, అందుకు కేవలం అతని చదువు వల్లే సాధ్యం అయిందన్నారు. జవహర్ లాల్ నెహ్రు, గాంధీ లాంటి మహానుభావులను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. సెల్ ఫోన్స్ వచ్చాక ఎవ్వరూ పేపర్ చదవడం మానేసారని, విద్యార్థులు ప్రతీ రోజు పేపర్ చదవడం వల్ల సమాజంలో జరిగే మంచి, చెడులు తెలుస్తాయని, . చదవడం వల్ల మానసిక ఉల్లాసంతో పాటు విషయ పరిజ్ఞానం కూడా పెరుగుతుందన్నారు. చదవాలనే ఆలోచన ఉండాలి, పై స్థాయికి వెళ్ళాలి అనే లక్ష్యం పెట్టుకుని చదవాలని విద్యార్థులకు సూచించారు. చాలా మంది విద్యార్థులు కష్టపడి చదువుతున్నారని అలా చదవడం వల్ల మానసిక ఆందోళన, ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. చదువుని ఇష్టపడి చదవాలి గాని కష్టపడి చదవకూడదని సూచించారు. అబ్దుల్ కలాం చాలా పేదరికంలో ఉండేవారని, ఆయన ఎప్పటికైనా విమానంలో తిరగాలని సంకల్పించారని అది నెరవేర్చుకోవడం కోసం ఎంతో కష్టపడి మెకానిక్ ఇంజనీరింగ్ చదివి ఆయన కలని నెరవేర్చుకున్నారని అన్నారు. చినిగిన షర్ట్ వేసుకో కానీ ఒక కొత్త పుస్తకం కొనుక్కోఅనే సూత్రాన్ని కలాం ఆచరించి చూపించారని తెలిపారు. పేదరికం అనేది చదువుకు అడ్డు కాదని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన దృక్పథం మారితే అంగవైకల్యం కూడా అడ్డుకాదని, ఆత్మవిశ్వాసంతో చదువుకోవాలని అన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మనల్ని చదివిస్తున్నారని వారి నమ్మకాన్ని నిలబెట్టాలని తెలిపారు. సంఘంలో గౌరవంగా బతకాలంటే చదువు ఒక్కటే మార్గం అన్నారు. మనకి కావాల్సిన ప్రతీ పుస్తకం గ్రంథాల యాల్లో ఉంటాయని వాటిని మన మేదస్సును పదును పెట్టుకునేలా ఉపయోగించుకోవాలని తెలిపారు. ఐ.ఏ.ఎస్, ఐ.పి.ఎస్ అవ్వాలంటే వాటిని సాదించుకునేలా కష్టపడాలని, నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎక్కువ సమయం తీసుకోకుండా, లక్ష్యాన్ని చేరుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్ ప్రిన్సిపల్ డా.బి.శాంతి కుమారి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, రాష్ట్ర గ్రంథాలయ సంఘం అధ్యక్షులు కె. శివ కేశవ రావు, కార్యదర్శి చొక్కాపు శ్రీనివాస రావు, ఏపిటిఎఫ్ కార్యదర్శి నల్లా బాల కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగాశ్రీ గౌరీ పరమేశ్వరులకు అభిషేకాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా అగ్గి మర్రి చెట్టు వీధిలో వెలసిన శ్రీ గౌరీ పరమేశ్వరులు శ్రీ సుందరేశ్వర స్వామి శ్రీ మీనాక్షి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు మాజీ మున్సిపల్ చైర్మన్ మల్ల సాంబశివరావు చేతుల మీదుగా పాలాభిషేకం నిర్వహించారు. ఆలయ శాశ్వత చైర్మన్ కొణతాల కారు బాబు మరియు సేవా సాధన అధ్యక్షులు కాండ్రేగుల నూక రామలింగస్వామి తదితరులు సాంబశివరావును శాలువా వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ కారుబాబు ఇటువంటి దైవ కార్యక్రమాలు చేయడం ద్వారా సమాజ క్షేమం జరుగుతుందని ప్రజల్లో భక్తి భావం పెరిగి ఆధ్యాత్మికతను పెంపొందించుకుంటారని సాంబశివరావు అన్నారు.ఈ కార్యక్రమంలో అళ్ల సంతోష్ దంపతులతో పాటు కాండ్రేగుల్ తేజ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యల్లపు చంద్రమోహన్ కాండ్రేగుల సూర్య అప్పారావు వెంకట సత్యనారాయణ వెంకట సూరి అళ్ల నూక అప్పారావు తదితరులు పాలాభిషేకంలో పాల్గొన్నారు.

పంచాంగం

మంగళవారం 15-11-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం శరదృతువు
కార్తీక మాసం

తిథి : బ. సప్తమి తె. 05.50
నక్షత్రం : పుష్యమి సా. 04.11
వర్జ్యం : లేదు



సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.

బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నైలో ఉన్నారు.

సెల్ : 9440537607

### స్పందన అర్జీలు పునరావృతం కాకూడదు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీలు మరలా తిరిగి మరోసారి రాకూడదని జిల్లా కలెక్టర్ జిల్లా రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. దరఖాస్తు లేదా ఫిర్యాదు మొదటిసారి వచ్చినప్పుడే సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తిగా పరిష్కరించాలన్నారు. స్పందనలో దరఖాస్తు చేసిన వారికి పూర్తి సంతృప్తి కరమైన జవాబు ఇవ్వాలన్నారు. ఈరోజు స్పందన కార్యక్రమానికి 166 అర్జీలు వచ్చాయి. జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి ఎం. సీతామహాలక్ష్మి స్పందన అర్జీలను స్వీకరించారు. సీతా మహాలక్ష్మి వికలాంగుల వద్దకు వెళ్లి వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు.

### ఉపమాకలో పోటెత్తిన భక్తజనం

**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో కొలువైన లక్ష్మణేశ్వర స్వామి ఆలయానికి కార్తీకమాసం మూడవ శనివారం సందర్భంగా భక్తులతో ఆలయ ప్రాంగణమంతా పోటెత్తింది.సుదూర ప్రాంతాలనుండి వచ్చిన భక్తులకు తెల్లవారుజామున మూడుగంటలనుండి స్వామి దర్శనం కల్పించారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది సౌకర్యాలు కల్పించారు.ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో ఆలయానికి భక్తులు వచ్చారు.

**భక్తులకు అన్నదానం:** ఆలయానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

### కుమ్మరి శాలివాహనుల సమస్యల పరిష్కారానికి కృషి

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో కుమ్మరి శాలివాహనుల సమస్యల పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంఘ చైర్మన్ ఎమ్.పురుషోత్తం తెలిపారు. సోమవారం డైరెక్టర్ డి.ఏ. వెంకటరావు ఇతర సభ్యులతో కలసి జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి కి విజ్ఞాపన పత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొత్తగా నియమింప బడిన సంఘ సభ్యులు కొత్తూరు జయమ్మ (తీడ గ్రామము), శ్రీకాకులపు జగదీశ్వ రరావు (నరసయ్యపేట)కొత్తూరు త్రిమూర్తులు (దేవరాపల్లి), మునగపాక గోవింద (యలమంచిలి) బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బీసీ సంక్షేమ అధికారి కే.రాజేశ్వరి సంఘ సమావేశం నిర్వహించారు. చైర్మన్, డైరెక్టర్ సభ్యులు జిల్లా లో కుమ్మరి శాలివాహనలకు సమస్యలపై చర్చించారు.

### అన్న సమారాధన ప్రారంభించిన రత్నాకర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి ప్రసిద్ధి చెందిన శ్రీ కుంచా వారి శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవ భాగంగా, కార్తీక మాసం మూడు సోమవారం సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా వైసిపి పార్లమెంట్ పార్టీకి కన్వీనర్ దాడి రత్నాకర్ హాజరై అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో. కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు పాండ్రంకి సత్యారావు, కోరుకొండ శివ, కోటిపల్లి జేజిబాబు, శిల్పర శెట్టి బాబి కుంచా వారి కుటుంబ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వెంటిలేటర్ పైనే సూపర్ స్టార్

ఉన్నట్టుండి అనారోగ్యానికి గురైన టాలీవుడ్ సూపర్ స్టార్ కృష్ణ ఆరోగ్యం సోమవారం సాయంత్రానికి కూడా తీవ్ర విషమంగానే ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం కృష్ణకు చికిత్స అందిస్తున్న కాంటినెంటల్ ఆసుపత్రి ఓ బులెటిన్ ను విడుదల చేసింది. సోమవారం తెల్లవారుజామున ఆసుపత్రికి వచ్చిన సమయంలో కృష్ణకు గుండె పోటు వచ్చిందని వైద్యులు ఇదివరకే ప్రకటించిన సంగతి తెలిసిందే. సీపీఆర్ చేయడంతో గుండె పోటు ముప్పు నుంచి కృష్ణ తప్పించుకున్నా... ఆయన ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని తెలిపారు.

ప్రస్తుతం కృష్ణకు 8 మంది వైద్య నిపుణులతో చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కార్డియాక్ అరెస్టులో కృష్ణ శరీరంలోని పలు అవయవాల పనితీరుపై తీవ్ర ప్రభావం పడిందని ఆసుపత్రి తెలిపింది. కార్డియక్ అరెస్టు కారణంగా కృష్ణ శరీరంలోని మూత్ర పిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, మెదడు పనితీరు దెబ్బతిన్నదని వెల్లడించింది. ఇంకో 24 గంటలు గడిస్తే గానీ కృష్ణ ఆరోగ్య పరిస్థితి ఏమిటన్నది చెప్పలేమని కూడా వెల్లడించింది. ప్రస్తుతం వెంటిలేటర్ పైనే కృష్ణకు చికిత్స అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

విశాఖ సమాచారమ్

మంగళవారం 15-11-2022

# ప్రదక్షిణ- ప్రాముఖ్యత

హిందూ ధర్మంలో 'పరిక్రమ' లేదా 'ప్రదక్షిణ' మరియు వాటి సంఖ్య యొక్క ప్రాముఖ్యత ఏమిటి?

పరిక్రమ (ప్రదక్షిణ) లేదా ప్రదక్షిణ అనేది హిందూ మతం మరియు కొన్ని ఇతర మతాలలో ఒక ఆచారం, దీనిలో ఒక వ్యక్తి సవ్యదిశలో ఒక వ్యక్తి లేదా వస్తువు చుట్టూ ప్రదక్షిణ చేస్తాడు.

సంస్కృతంలో 'పరి' అంటే 'చుట్టూ' మరియు 'క్రమ' అంటే 'వెళ్లడం'. కాబట్టి పరిక్రమ అనే పదానికి చుట్టూ తిరగడం అని అర్థం. ప్రదక్షిణలో రెండు పదాలు ఉంటాయి, అవి. 'ప్ర' మరియు 'దక్షిణ (కుడి), అంటే 'కుడివైపు'.

మనలో చాలా మంది దేవత దర్శనం కోసం దేవాలయానికి (ఆలయానికి) వెళుతుంటారు.

దర్శనం యొక్క గరిష్ట ప్రయోజనం పొందడానికి, ఒకరు తప్పనిసరిగా దేవత యొక్క ప్రదక్షిణ (ప్రదక్షిణ) చేయాలి.

ప్రదక్షిణ ప్రారంభించడానికి, చేతులు ముడుచుకుని గర్భ-గృహ (గర్భగృహం) ఎడమ వైపు నుండి సాధారణ వేగంతో కదలడం ప్రారంభించవచ్చు.

నమస్కార్-ముద్రలో (రెండు చేతులు జోడించబడి, అనాహత్-చక్ర స్థాయిలో ఉంచబడ్డాయి (ఆధ్యాత్మిక శక్తి ప్రవాహ వ్యవస్థలో నాల్గవ కేంద్రం, సూక్ష్మ-శరీరంలో గుండె ప్రాంతంలో ఉంది), కానీ కొద్దిగా దూరంగా శరీరం), దేవత నామాన్ని జపిస్తున్నప్పుడు.

విశ్వంలోని ప్రతి పవిత్ర వస్తువులో దైవిక శక్తి ఉంటుందని హిందువులు నమ్ముతారు. ఈ శక్తి ప్రధానంగా ఆ వస్తువులో కేంద్రీకృతమై ఉన్నప్పటికీ, అది కొంత దూరం వరకు విస్తరించి ఉంటుంది.

అందువల్ల, ఒక వ్యక్తి ఆ వస్తువు చుట్టూ తిరుగుతుంటే, అతడు/ఆమె ఆ పవిత్ర శక్తితో సంబంధంలోకి వస్తుంది,

ఇది ఆధ్యాత్మికంగా మరియు భౌతికంగా చాలా సహాయకారిగా ఉంటుంది.

పరిక్రమ సవ్య దిశలో కుడి వైపు శుభంగా పరిగణించబడుతుంది. హిందువులు ఎడమ చేతిలో ప్రసాదాన్ని స్వీకరించరు లేదా దానితో పవిత్ర వస్తువులను తాకరు.

మనం సవ్యదిశలో వెళ్లడానికి కారణం భూమి యొక్క అయస్కాంత క్షేత్రం దిశలో మన అయస్కాంత క్షణాన్ని పెంచడం, తద్వారా దాని నుండి శక్తిని పొందడం.

ప్రాచీన భారతదేశంలోని చాలా దేవాలయాలు కేవలం దేవాలయాలు మాత్రమే కాదు. అవి సానుకూల శక్తికి కేంద్రాలు.

ఈ ప్రాంతంలోని అయస్కాంత క్షేత్రాన్ని పరిశీలించిన తర్వాత ఆలయాల కోసం స్థలం ఎంపిక చేయబడింది. మరియు ప్రజలు నమ్మరు, కానీ మన పూర్వీకులు ఈ రోజు మనకు తెలిసిన దానికంటే చాలా ఎక్కువ సైన్స్‌ని వర్తింపజేసారు.

యాని కాని చ పాపాని జన్మాంతరకృతానిచ ?

తాని తాని వినశ్యంతి ప్రదక్షిణ పదే పదే ??

ప్రదక్షిణ చేస్తున్నప్పుడు, కొందరు వ్యక్తులు తమ వేళ్లతో ఆలయ గోడలను తాకి, దేవత పట్ల గౌరవాన్ని చూపడానికి వేళ్లను తిరిగి నుదిటిపై ఉంచుతారు. మీరు వస్తువును మీ కుడి వైపున ఉంచుకుంటే దీన్ని చేయడం సులభం. దేవాలయాలు సానుకూల శక్తిని పొందేందుకు మరియు మనశ్శాంతిని పొందే ప్రదేశం.

పరిక్రమాల సంఖ్యబీ దేవతను బట్టి మారుతుంది. అలాగే, ఒక దేవత చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేయాలి అనే విషయంలో కూడా వైరుధ్యాలు ఉన్నాయి

సాధారణంగా, ఒక దేవత యొక్క బేసి సంఖ్యలో ప్రదక్షిణలు మరియు దేవుని సరి సంఖ్యలు చేయాలని నమ్ముతారు.

ఏ దేవతకైనా 21 సార్లు ప్రదక్షిణ చేస్తే పునీతమవుతుందని స్వయంభూ ఆగమం చెబుతోంది.

హిందూ దేవుళ్ల చుట్టూ ఎన్ని పరిక్రమాలు చేయాలో సూచించే సంస్కృత శ్లోకం ఉంది,

ఏక చండ్యా రావే: సప్త, తిష్టర: కార్య వినాయకే:.

హరేశ్చతస్ర: కర్తవ్యా:, శివస్యార్ధ ప్రదక్షిణా ??

ఒక భక్తుడు ఒక దేవతకు ఒక ప్రదక్షిణ, సూర్యునికి ఏడు, గణేశుడికి మూడు, విష్ణువు మరియు అతని అవతారాలకు నాలుగు, శివునికి సగం ప్రదక్షిణలు చేయాలి.

గణేశుడు: 3. హనుమంతుడు: 3. మా దుర్గ: 1. విష్ణువు మరియు అతని అవతారాలు: 4. సూర్యుడు: 7. పీపల్ చెట్టు: 7. యజ్ఞం: 5, 11, లేదా 108. కార్తికేయ: 6.

వివిధ సంఖ్యలకు కారణం

దేవత చుట్టూ ప్రదక్షిణలు చేయాలి -

సాధారణ నియమం ఏమిటంటే, పురుష దేవతలకు, ప్రదక్షిణల సంఖ్య 'సరి' సంఖ్యలలో ఉండాలి (0, 2, 4, 6), మరియు స్త్రీ దేవతలకు ఇది బేసి సంఖ్యలలో (1, 3, 5, 7) ఉండాలి. )

కారణం ఈ క్రింది విధంగా ఉంది. 'సున్నా' అనేది బ్రహ్మను సూచిస్తుంది, అంటే, విశ్వం యొక్క సృష్టికర్త అయిన సర్వోన్నత దేవుడు. 'సున్నా' నుండి, సంఖ్య 'వన్', అంటే, మాయ (మహా భ్రమ), అంటే, విశ్వం ఉద్భవించింది. మాయ స్త్రీలింగం, మరియు 'ఒకటి' సంఖ్య 'బేసి సంఖ్య'.

అందువల్ల, స్త్రీ దేవతల చుట్టూ ప్రదక్షిణను 'బేసి' సంఖ్యలలో చేయాలి. 'సరి' సంఖ్యలు 'సున్నా'తో సంబంధం కలిగి ఉంటాయి కాబట్టి, పురుష దేవతల చుట్టూ ప్రదక్షిణ 'సరి' సంఖ్యలలో చేయాలి.

# దివ్యాంగుల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రభుత్వ దివ్యాంగుల బాలుర వసతి గృహం, జాలరిపేటలో చదువుకున్న 1985 నుండి 1995 మధ్య చదివిన దివ్యాంగులు వసతి గృహ ప్రాంగణంలో పూర్వ విద్యార్థుల అపురూప కలయిక కార్తీక వనమహోత్సవం సందర్భంగా 30 సంవత్సరాల తరువాత కలుసుకొని పాత జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. నాడు నేడు కార్యక్రమంలో భాగంగా వసతి గృహాన్ని అధునికరినచాలని ప్రభుత్వాన్ని కోరారు.వార్డెన్లు టీచర్ల సహకారంతో చాలా మంది ఉన్నత స్తిస్తులలో స్థిరపడినారని తెలిపారు . వసతి గృహంలోని బాలురకు పండ్లు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ లక్ష్మి, అప్పలరాజు ,ఈశ్వరరావు, పద్మావతి, పూర్వ విద్యార్థులు ఒ.రామరాజు, కే.పి ఋషి, సురేష్ మీనన్,గణేష్, శేషు, రఘునాథ్ పండా తదితరులు పాల్గొన్నారు.

# మిస్టర్ ఆంధ్రా గా అరకు అప్పారావు



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** మిస్టర్ ఆంధ్రా ప్రదేశ్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్ లో మను డైనమిక్ ఫిట్నెస్ జిమ్ ఆధ్వర్యంలో గురు భాష, మను వైశాకి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించారు జనరల్ ఎనిమిది గ్రూప్స్ జూనియర్ 1.గ్రూప్ మాస్టర్స్ 1.గ్రూప్ మెన్స్ ఫిజిక్ 2.గ్రూప్స్ గా నివసించారు ప్రతి గ్రూపుకు ఐదు ప్రైజెస్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేశారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాగంటి శ్రీనివాసరావు గారు పాల్గొన్నారు అరకు లోయ నుండి పి.అప్పారావుమాస్టర్స్ విభాగంలో ప్రతిభ సాధించినందుకు కే వీరారెడ్డి గారి చేతుల మీదుగా అప్పారావు కి ట్రోఫీ అందించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుండి అన్ని జిల్లాల బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు ప్రతిభ సాధించిన ప్రతివారికి టోపీ మెడల్స్ క్యాష్ అవార్డుమరియు సర్టిఫికెట్లు అందజేశారు ఈ కార్యక్రమంలో ఏపీ బి బి ఏ ప్రెసిడెంట్ కే. సోమి నాయుడుజనరల్ సెక్రెటరీ కె. గురునాథరావు పి.రాము తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా దివ్య నామ సంకీర్తనలతో ముగిసిన శ్రీ సత్యసాయి అఖండ భజన"



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం ఎంవీపీ కాలనీ, శ్రీ సత్యసాయి విద్యా విహార్ పాఠశాలలో ఉన్న శ్రీ సత్య సాయి ప్రేమ సదన్ మందిర్‌లో సిటీ సేవా సమితికి చెందిన ప్రముఖ సీనియర్ సమితి గాయకులచే భక్తిశ్రద్ధలతో మరియు శ్రావ్యమైన భజనలతో నిన్న ప్రారంభమైన శ్రీ సత్యసాయి గ్లోబల్ అఖండ భజన మహా మంగళ హారతితో ముగిసింది.

గ్లోబల్ అఖండ భజన విశ్వశాంతి కోసం సర్వశక్తిమంతుని దీవెనలు కోరుతూ ప్రపంచవ్యాప్తంగా 130కి పైగా దేశాల్లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా భక్తులు మరియు అనుచరులు ప్రతి సంవత్సరం నవంబర్ 2వ శనివారం సాయంత్రం 6 గంటల నుండి మరుసటి రోజు అంటే ఆదివారం సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు.

శ్రీ సత్య సాయి సిటీ సేవా సమితు కి చెందిన ఆరిలోవ, మండలి, ఎంవీపీ, ఎండాడ, సాగర్‌నగర్, విశాలాక్షినగర్ లాసన్స్ బే కాలనీ, వాల్టెయిర్ అప్‌ల్యాండ్స్, హెచ్‌బి కాలనీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, హెచ్‌బి కాలనీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, శ్రీ సత్యసాయి భజన మండలి భక్తులు, శ్రీ సత్య సాయి విద్యా విహార్ ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు, , బాలవికాస్ విద్యార్థులు, గురువులు, శ్రీ సత్యసాయి యువత భక్తిశ్రద్ధలతో గ్లోబల్ అఖండ భజనలో భక్తితో ఉత్సాహంగా పాల్గొన్నారు.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారికి మహా మంగళ హారతి సమర్పణతో గ్లోబల్ అఖండ భజన ఈ రోజు (ఆదివారం) సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది.

శ్రీ సత్య సాయి సేవా సంస్థల ద్వారా ఉచిత ఆరోగ్య శిబిరాలను అనేక చోట్ల, ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో నిర్వహిస్తున్న శ్రీ సత్య సాయి మెడికల్ బృందం డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది శ్రీ సత్య సాయి బాబా వారికి పుష్పాలతో పూజ చేశారు.

పిఆర్ఎస్ఎన్ నాయుడు, జిల్లా అధ్యక్షులు, శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, విశాఖ జిల్లా, డివివి సీతారామరాజు, కన్వీనర్, శ్రీ సత్యసాయి సిటీ సేవా సమితి, ఎ.కౌసల్య, సత్యసాయి విద్యావిహార్ ప్రిన్సిపాల్, సీనియర్ భక్తులు రాశీ, .పలువురు ఆఫీస్ బేరర్లు, భక్తులు గ్లోబల్ అఖండ భజనలో పాల్గొన్నారు.

# బాలల దినోత్సవ కార్యక్రమం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శాంతి ఆశ్రమంలో, రౌండ్ టేబుల్ చైర్మన్ సౌరభ్ ధనుక, మక్సుద్ అహ్మద్ , నీలేష్ జైన్ గారు రౌండ్ టేబుల్ సభ్యులు సుప్రజ కంచర్ల గారు, భారత్ కల్లపాడి గార్లు బాలల దినోత్సవం కార్యక్రమాన్ని పునస్కరించుకుని, శాంతి ఆశ్రమంలో విద్యార్థిని విద్యార్థులకు,, వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు పిల్లలకు వినోదం కోసం మ్యాజిక్ షో కూడా ఏర్పాటుచేసి పిల్లలందరికీ మానసిక ఉత్సాహాన్ని అందజేశారు. ఈ పోటీలలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులు అందరికీ కూడా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సభ్యుల బృందం పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహించాలి : ఎస్.ఐ అనీల్ కుమార్




**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 10 వ వార్డు తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం వద్ద ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఉపకార సేవా సంస్థ అధినేత కంచర్ల అచ్యుతరావు ఆర్థిక సహాయాన్ని ప్రోత్సకాలను అందజేశారు.

12 13 తేదీల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్ పోటీలలో రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి బాలికలు బాలురు జట్లు పాల్గొన్నారు. అసోసియేషన్ రెండు రోజుల పాటు నిర్వహించిన పోటీలకు బాలికలు బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లాకు చెందినవారు ప్రదస్థానంలో నిలిచారు వారికి ఆరిలోవ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ అనిల్ పదో వార్డు వైసిపి నాయకులు మద్దిల రాజశేర్ ఉపకార సంస్థల సభ్యులు బహుమతులను అందజేశారు. అనంతరం ఉపకార్ సేవ సంస్థ సభ్యులు స్పోర్ట్స్ నిర్వహణకు 50000 వేల నగదును అందజేశారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆరిలోవ ఎస్సై బి .అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్య తో పాటు క్రీడలు కూడా చాలా ప్రాముఖ్యమని చిన్నతనం నుండి క్రీడలు ప్రోత్సహించినట్లయితే క్రమశిక్షణతో పాటు విద్యా బుద్దులు సక్రమమైన మార్గం లొ నడుస్తారాని, ప్రస్తుత పరిస్థితుల్లో గంజాయి, మద్యపానం వంటి చెడు అలవాట్లకు అలవాటు పడుతున్న యువతరం మత్తు బానిసలు కాకుండా క్రీడలు క్రమశిక్షణ గల జీవితాన్ని ప్రారంభించడానికి దోహదపడతాయని అన్నారు.

ప్రధాన కార్యదర్శి ఎం .సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఉపకార సేవ సంస్థ అధినేత కంచర్ల అచ్యుతరావును సంస్థ అధ్యక్షులుగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశామని దానికి సంబంధించిన పత్రాలు కూడా వారికి అందజేశామని ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని, రెండు రోజులు నిర్వహించిన స్పోర్ట్స్ కు సహాయ సహకారాలు అందించిన తోట గరువు ఉన్నత పాఠశాల ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సిబ్బందిలకు కృతజ్ఞతలు తెలియజేసారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ ద్వారా జిల్లా పరంగా రాష్ట్ర, అంతర్ రాష్ట్ర నేషనల్ ఇంటర్నేషనల్ ద్వారా అనే కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలియజేశారు కార్యక్రమంలో ఉపకారి సేవా సంస్థ సభ్యులు పొట్టి అప్పారావు, సిద్ధు నాగ జిల్లా కార్యదర్శి సందీప్, యాష్మ సాయి, పైలా రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆనాటి జ్ఞాపకాలెంతో మధురం

## 26 ఏళ్ల తర్వాత కలుసుకున్న ఎల్.బి కళాశాల విద్యార్థులు



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** విశాఖ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 1991-96 మధ్య కాలంలో విద్యనభ్యసించిన విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత మొదటిసారి ముడ సర్లోవ పార్కులో ఆదివారం కలుసుకున్నారు. ఇతర రాష్ట్రాలలో విధులు నిర్వర్తిస్తున్న వారు కూడా కలయిక లో పాల్గొన్నారు. పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ సరదాగ గడిపారు. ఇకనుంచి ప్రతీ ఏటా సమావేశం అవ్వాలని నిర్ణయించుకున్నారు. ఒక సంస్థగా ఏర్పడి సేవా కార్యక్రమాలు నిర్వహిన్చాలని నిర్ణయించారు.

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి 82వ వార్డు జీవీఎంసీ ఉడ్ పేట ప్రాథమిక పాఠశాలలో బాల దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముందుగా భారత ప్రథమ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ చిత్రపటానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, డిసిసిబి అనకాపల్లి బ్రాంచ్ మేనేజర్ స్వాతి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా మందపాటి జానకిరామరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. నైతిక విలువలతో కూడిన విద్యాబోధన చేయాలన్నారు. బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. పాఠశాల, విద్యాభివృద్ధి, క్రీడాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. విద్యా కమిటీ చైర్మన్ చిట్టితల్లి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనలు పలువురుని ఆకట్టుకున్నాయి.

# విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పలకలు పంపిణీ



**గాజువాక, (విశాఖ సమాచారమ్):** పెదగంట్యాడ మండలం ఎస్.సి కోలనీలో నాయకులు వెంకటరావు ఆద్వర్యంలో చిల్డ్రన్స్ డే వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా బీజేపి నేత కరణంరెడ్డి నరసింగరావు పాల్గొని ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు పలకలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని ప్రతి ఒక్కరు దేశం కోసం ధర్మం కోసం పాటుపడాలని , బాగా చదువుకొని అన్ని రంగాలలో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గంట్యాడ గురుమూర్తి, ములకలపల్లి ప్రకాష్ , కిలాని ముసలయ్య , డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# నాయుడుపాలెంలో ఘనంగా అయ్యప్ప స్వామి అంబలం పూజ

**పరవాడ, (విశాఖ సమాచారమ్):** పరవాడ మండలం నాయుడుపాలెం పీఠం,సిద్ధి వినాయక ఆలయం వద్ద ఆదివారం రాత్రి కుంద్రపు శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో భారీ అయ్యప్ప స్వామి అంబలం పూజ నిర్వహించారు. ఈ పూజకు సుమారు 200 మంది అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## కవితల పోటీకి ఆహ్వానం

మహాకవి గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని తేదీ 30-11-22 న సమాఖ్య నిర్వహించే గురజాడ సాహితీ చైతన్యోత్సవం లో భాగంగా నిర్వహిస్తున్న కవితల పోటీ.

1. శ్రీకాకుళం, విశాఖ, మన్యం పార్వతీపురం, విజయనగరం జిల్లాల కవులు మాత్రమే పాల్గొనవలెను.
2. వచన కవిత, గేయం, ముత్యాల సరం ఏదైనా, 15 నుండి 20 లైన్లకు మించరాదు.
3. రచనలు సామాజిక చైతన్యం కలిగి ఉండాలి. శైలి సులభ సుందరంగా ఉండాలి. మహాకవి గురజాడ గుర్తుకు రావాలి
4.రచనలను 20-11-22 తేదీ లోగా వాట్సాప్ ద్వారా క్రింది నంబరులకు పంపవలెను
5. బహుమతులు పొందిన కవిత మహాకవి గురజాడ వర్ధంతి నాటి ఉదయం సాహితీ సభలో పఠించవలసి ఉంటుంది,
6. బహుమతి గ్రహీతలను, ప్రథమ బహుమతి రూ..1500.00 లు, ద్వితీయ బహుమతి రూ. 1000.00 లు, తృతీయ బహుమతి రూ.750.00 లు, కన్సోలేషన్ బహుమతి రూ. 500.00 లు తో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రము, శాలువ తో సత్కరించబడును.

**మనందరి కృషి మహాకవి గురజాడకు అక్షర హారతి**
**రచనలు పంపవలసిన నంబర్లు**
**డా. జక్కు రామకృష్ణ, సాహితీవేత్త**
**94414 27386**
**శ్రీమతి మానాప్రగడ సాహితి, రచయిత్రి**
**9989370358**
**ఇట్లు**
**కాపుగంటి ప్రకాష్,**
**ప్రధాన కార్యదర్శి, గురజాడ సాంస్కృతిక సమాఖ్య**
**విజయనగరం**

## గెలుపు అంటే ... ?

ఎదుగుతున్న వ్యక్తిని
ఎగతాళి చేసే కుట్రలు
జరుగుతూనే ఉంటాయి
పురోగతిని పతనం చేసే
కుతంత్రాలు
రగులుతూనే ఉంటాయి !

మనో ధైర్యాన్ని దెబ్బతీస్తే
ప్రత్యర్థి కుప్పకూలిపోతాడని
దుర్భాషల తూటాల్ని
సంధిస్తూనే ఉంటారు
గేలిచేసి అవమానిస్తే
పోటీదారు వెనుదిరిగిపోతాడని
విద్వేషాల బాణాల్ని
ప్రయోగిస్తూనే ఉంటారు !

అయినప్పటికీ ........
ఆత్మవిశ్వాసపు జ్యోతిని
ఆరనీకు సుమా !
సూర్యుడవై రగులుతూనే ఉండాలి

ఎదుగుతున్న నిన్ను ఎగతాళి చేస్తే
జవాబు విజయంతోనే చెప్పాలి !
పురోగతిని అడ్డుకునే కుతంత్రాలు చేస్తే
సమాధానం విజయంతోనే చెప్పాలి !
దుర్భాషల తూటాల్ని ,విద్వేషపు బాణాల్ని
విజేతవై ఎదుర్కొని
విరోధుల నోరు మూయించాలి !

**గెలుపు అంటే ..**

వైరి వర్గం ఎత్తుల్ని
గుండె నిబ్బరంతో చిత్తుచేయడమే !
శిఖరమంత ఎత్తు ఎదిగి
శత్రు శిరస్సులు నీ ముందు
మోకారిల్లేటట్లు చేయడమే !

**పి. లక్ష్మణ్ రావ్**
**అసిస్టెంట్ రిజిస్ట్రార్ (సహకార శాఖ )**
**విజయనగరం**
**9441215989**
**కాదంబరి. 8056182249**

---

**ప్రియ , ఏమి నీ ముఖారవిందం,**
ఎన్నో భావాలను వెలువరచు,
ఆ కనుదోయలు,
చిరుమందహాసంతో విచ్చుకొను,
ఆ పెదవులు
నా హృదయతంత్రులు
మీటుచు,
నీ మాటలు నాలో
మధుర భావనలను రేపి,
నా మదిని కలవరింప
జేయు చున్నవి,
నీ దరహాసం నన్ను
నదిలో పయనించు
నావవలె ఆటలాడు
కొనుచున్నది
ఇక మధురమైన పలుకులు
వెలువరిస్తున్న నీ పెదవుల కదలికలు ,
నా మేనును ఊయల
ఊగించుచున్నది,
హుందాగా
మెల్లిమెల్లిగా అడుగులేస్తూ
నిష్క్రమిస్తున్న
నీలోనా సర్వస్వం
విలీనం అయిపోయే ప్రియతమా!
కాదంబరి.

## మనసున రేగుతోంది ఓ వింత అలజడి

నన్ను నేను నీలో చూస్తూ గడిపిన క్షణాలు
పరవశాన మైమరిచిన తీయని మజిలీలు
తిరిగి మళ్ళీ ఎపుడు అని మనసు ప్రశ్నించిన
ప్రశ్నకు సమాధానమేమో ఈ తీయటి అలజడి.

నీతో ముడివడిన హృదయ లయలో
నీ రాకకై ఎదురు చూస్తోందని తెలుపుతూ
తనను తాను ఓదార్చుకొను ఘడియన
ఆప్యాయత,స్వచ్ఛత నిండిన నీ స్నేహంలో
తీయటి కలల పలవరింతేనేమో ఈ అలజడి.

ఈ అలజడుల మౌనంలో
మౌనమై నాలో నేను
కరుగుతున్నా..
అలుపెరుగని శోధనలలో
గమ్యం లేని రహదారిలో పయనిస్తున్నా....

SRIDEVI REDDY.AILA
Copyright Aila Sri Devi Reddy
Pc pinterest

### స్పృహ

కానీ ఎందుకు!?
అని కొన్నింటిని అడగాలని వుండదు
ఎలా ఇలా!?
అని కొందరిని నిలదీయాలనీ అనిపించదు

రెక్కలు పుచ్చుకు లాగుతున్న
బంధాలతో కలిసి వెళ్ళిపోలేనప్పుడు
అతుకుల బొంతలాంటి
జీవనాన్ని సాగించలేనప్పుడు
మధ్యే మార్గంగా మౌనాన్ని ఆశ్రయించాల్సిందే

కాదూ కూడదని
కన్నీరు కలలను కడగడం ప్రారంభించినప్పుడు
మనసుకు మనసుకు
దూరం పెంచుకుంటూ
మనిషికీ మనిషికీ నడుమ
కాస్త కాస్తగా కంచెను వేసుకుంటూ
అల్లుకుపోయిన ప్రేమలను
పాతుకుపోయిన అభిమానాన్ని
లోతుకు పోయిన ఆత్మీయతను
పెకలించవలసిందే

నూనూగు హృదయ స్పర్శను
గరకుగా మార్చుకోవలసిందే.

**సుధా మురళి**

**ప్రేమసంజీవనీ**

నా ప్రేమైక అక్షరాల గడ్డిపూలను
కాలితో తొక్కి వెళ్ళిపోయింది
విలవిల లాడిన నా హృదయం
కార్చిన కన్నీటితైలంతో
దీపాలను వెలిగించాను
ఆమె వెళ్ళే మార్గంలో
ఆమెకు దారిదీపమై
పురాస్మృతుల పుష్పగుచ్ఛాన్ని
అందించాను మదిలోనే
అమూర్తభావనల ధ్యానంలో
దివారాత్రులు ఆమెతలపులలో
నా గాయాలను
వలపుగేయాలుగా రాసాను
ఆమె ప్రేమలో తాధాత్మ్యం చెందుతూ ...
ఆ ప్రకృతి భక్తి పారవశ్యంలో
ఆమె తిరస్కారం
నా అమలిన ప్రేమకు
ఆత్మీయ పురస్కారమే
వెలుగు వున్నచోట చీకటి ఛిద్రమైనట్టు
ప్రేమ వున్నచోట విద్వేషమెక్కడిది
"హృదయమా ఓ హృదయమా
ఎవరికొరకీ సవ్వడి
ప్రేమ యైనా విరహమైనా
గానమైనా మౌనమైనా
జాపకం మధురం కాదా ..."
చెట్లు పూలు రాల్చేది
కన్నతల్లి నేలను అభిషేకించడానికే
పూలగంధాలతో సేవించడానికే అన్నట్టు.
ఆమె ఎక్కడికి పోయింది
నాలోనే నాతోనే
నా హృదయంలో
నా అక్షరాలలో ఒదిగుంది
ప్రేమ సంజీవనీ మంత్రమై.
ప్రేమను ప్రేమించడమే
నిజమైన ప్రేమ విశ్వభాషలో
నా కవితాసుందరిని
నిత్యం ఆరాధిస్తూ.

**సరికొండ నరసింహ రాజు**

## బాలల దినోత్సవం

బాలల దినోత్సవ శుభాకాంక్షలు
ఏ బాలలకీ శుభాకాంక్షలు?
ఏ బాలలకు చెప్పనీ శుభాకాంక్షలు?
అమ్మ కూలిపని చేస్తూ,
పక్కన చెట్టుకి ఉయ్యాల కట్టి పడుకోపెడితే,
ఎండకి మాడి, ఆకలికి ఏడ్చే పసిగుడ్డకా?
బడి ఎరుగక, బాల్యం అంటే ఏమిటో తెలియక,
భారమైన జీవితం గడుపుతున్న బాల కార్మికుడుకా?
ఆడుతూ, పాడుతూ చెంగున ఎగిరే
పాలబుగ్గల పసిదానిని,
పైశాచికంగా అనుభవిస్తే,
అర్థంకాక, అయోమయంలో ఉంటున్న
చిదిగిపోయిన చిన్నారికా?
అమ్మా, నాన్నల ఆశలకోసం, విదేశాలే ఆశయమై
వీపుమీద పుస్తకాల మూట, నడిచేది రేంకుల బాట
ఆటా, పాటా మరిచి అడుగులు వేస్తున్న, పిల్లలకా?
ఎవరికి చెప్పమంటారు శుభాకాంక్షలు
బాల్యాన్ని బాల్యంగా, బంగారంలా
అనుభవించాలనేదే నా ఆకాంక్ష
రావాలి శుభోదయం
వస్తుందా అన్న సంశయం
వేచి ఉండమంటున్నది నా నమ్మకం
ఆశగా ఎదురుచూసి, ఆరోజు చెపుతా
బాలలందరికీ, బాలల దినోత్సవ శుభాకాంక్షలు.

**రాణి పార్తిబాన్**
**చెన్నై.**

# కార్తీక సోమవారం.. తెలుగురాష్ట్రాల్లో కిటకిటలాడిన శైవక్షేత్రాలు



శివకేశవులకు అత్యంత ఇష్టమైన కార్తీకమాస మూడో సోమవారం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని శివ క్షేత్రాలు భక్తజన సందడితో కనిపించాయి. కార్తీక మూడవ సోమవారం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటికిటలాడాయి. శివ నామస్మరణతో మారుమోగాయి. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు శివాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా కార్తీక దీపారాధన చేశారు. నదీ స్నానాలు ఆచరించి భక్తి ప్రపత్తులతో పూజాదికాలు చేస్తున్నారు.

తెలంగాణా ఆలయాల్లో కార్తీక సోమవారం నాడు పొటెత్తిన భక్తులు కార్తీక సోమవారం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని చారిత్రక ఆలయాలలో భక్తులు పూజాదికాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజామునుంచే భక్తులు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. వరంగల్ లోని వేయిస్తంభాల దేవాలయంలో, వరంగల్ కోట లోని శంభు లింగేశ్వర దేవస్థానం లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. రామప్ప రామలింగేశ్వర స్వామి దేవస్థానం కార్తీక మాసం సందర్భంగా దేదీప్యమానంగా వెలుగొందుతోంది. పాలకుర్తి సోమేశ్వరాలయం లోనూ భక్తులు విశేషంగా పూజలు నిర్వహిస్తున్నారు. కాళేశ్వరం లోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయం లోనూ భక్తులు పూజాదికాలు నిర్వహిస్తున్నారు.

ఏపీలోనూ ఆలయాల్లో భక్తుల సందడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ శైవ క్షేత్రాలు కూడా భక్తులతో కిటకిటలాడుతున్నాయి. కర్నూలు జిల్లాలోని శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపారాధన చేస్తున్నారు. గంగాధర మండపం, ఉత్తర శివమాడ వీధిలో కార్తీక దీపాలను వెలిగిస్తున్నారు. భక్తుల రద్దీ నేపథ్యంలో స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే భక్తులను అనుమతిస్తున్నారు.

శైవ క్షేత్రాలలో భక్తుల రద్దీ.. మార్మోగుతున్న శివ నామం అంతేకాదు శ్రీకాళహస్తి, కపిలతీర్థం సహా ఇతర శైవాలయాలు కూడా భక్తులతో నిండిపోయాయి. యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు. అన్నవరం సత్య నారాయణ స్వామి ఆలయంలో నిన్న అర్ధరాత్రి నుంచే వ్రతాలు, దర్శనాలు ప్రారంభమయ్యాయి. త్రిపురాంతకం, బైరవకోన, ఒంగోలు కాశీ విశ్వేశ్వర స్వామి,ద్రాక్షారామం, కుమారారామం భీమేశ్వర స్వామి దేవస్థానాలు భక్తులతో సందడిగా మారాయి.

పవిత్ర నదులలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు రాజమండ్రిలో గోదావరి స్నాన ఘట్టాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పుష్కర ఘాట్, మార్కండేయ ఘాట్, కోటిలింగాల ఘాట్, గౌతిమి ఘాట్‌లలో పెద్ద సంఖ్యలో భక్తులు పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. కృష్ణా నది పుష్కర ఘాట్ ల వద్ద కూడా పుణ్యస్నానాలు ఆచరిస్తూ భక్తులు ఆలయాలలో భగవద్దర్శనం చేసుకుంటున్నారు. మొత్తంగా 3వ కార్తీక సోమవారం కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేషంగా భక్తులు ఆలయ సందర్శనలు చేస్తూ పూజలు చేస్తున్నారు.

# ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానికరోటరీ క్లబ్, వాసవి క్లబ్, వాసవి వెల్ఫేర్ అసోసియేషన్, ఇన్నర్ వీల్ క్లబ్ లు సంయుక్తంగా సెవెన్ హిల్స్ విశాఖపట్నం వారి సహకారంతో అనుభవ వర్గయులైన డాక్టర్లతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. గుండె జబ్బులు, జనరల్ వ్యాధులు, మెదడు, వెన్నుపూస, కీళ్ల నొప్పులు, చిన్నపిల్లలకు, ఫిట్స్, నరములు వ్యాధులకు న్యూ కాలనీలో ఉన్న తాటికొండ నూకయ్య శెట్టి మెమోరియల్ రోటరీ హాల్ లో వైకాపా నేతలుమందపాటి జానకి రామరాజు జాజుల రమేష్ ఈ మెడికల్ క్యాంప్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. దీనికి సెవెన్ హిల్స్ డాక్టర్లు,ఏజీఎం ప్రశాంత్ కుమార్ , రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ సానా త్రినాథ్, సెక్రటరీ పెంటకోట రాజేష్ నాయుడు, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పవన్ కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్ డాక్టర్ శ్యాంసుందర్ గారు, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ సత్య, సెక్రెటరీ కడిమిశెట్టి లక్ష్మణరావు, ఇన్నర్ వీల్ ప్రెసిడెంట్ శ్రీదేవి, వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రొటేరియన్ కడిమిశెట్టి సతీష్ తో పాటు వాసవి క్లబ్ గవర్నర్ త్రినాథ్ శ్రీ పాడేరు ఈ కార్యక్రమానికి హాజరైనారు. మొత్తం ఈరోజు 300 మందికి వైద్య పరీక్షలు జరపడం జరిగినది ఉచితముగా బి.పి, షుగర్ అవసరం అయినవారికి ఈసీజి పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

# బాలల హక్కుల పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరణ

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించు కొని సమా నత్వం. సమ్మిలితమ్ బాలలందరి అందిద్దాం ..వివక్ష చేయ కుండా బాలలందరికి బాలల హక్కులు అందిద్దామ్ అనే నినాదంతో .బాలవికసా ఫౌండేషన్ సంస్థ రుపొందించిన పోస్టర్ ను సొమవారం ఎయు .జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్ విభాగ ఆదిపతి డి.వి.ఆర్ .మూర్తి ఆయన ఛాంబర్ లో ఆవిష్క రించారు. బాలల హక్కుల పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు బాలలు అన్నిరంగాలలో ముందు డు గు వేసి కుటుం బానికి దేశానికి కీర్తి ప్రతిష్టలు తెవలన్నారు ప్రభుత్వమ్ అందించె ఉచిత విద్య ను బాల లంద రూ సద్వినియోగం చేసుకోవాలి అన్నారు నరవ ప్రకాశ రావ్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ అవగాహన సిబిరాలు ఈ నెల 18 ె.నుండి 20వరకు వివిధ ప్రాంతాల లో పలు కార్యక్రమాలు నిర్వహించ నున్నారు.18న ఎయు సోషల్ వర్క్ విభాగం లో 19,న తోట గరువుల జిల్లపరిష్త్ స్కూల్లో 20 న బీచ్ రోడ్డు స్కూల్ లో హ క్కుల పరిరక్షణ పై అవగాహన .మరియు వివిధ రకాల పోటీ లు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ బాబ్జి.. డాక్టర్ చల్లా రామ కృష్ణ.డైరెక్టర్ ఎయు గాంధి యన్.స్టడీ సెంటర్. డాక్టర్ సి.ఎం.వినయ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.




# పవన్ కళ్యాణ్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన అలజంగి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై దుష్ప్రచారం చేస్తున్న పవన్ కళ్యాణ్ తీరునీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావురాష్ట్రవ్యాప్తంగా ఇంతవరకు 30.25 లక్షల మంది పేదవారికి ఇళ్ల స్థలాలు ఇచ్చాము21.25 లక్షల ఇల్ల నిర్మాణాలు జరుపుకోవడం జరుగుతుందిపూర్తి హక్కులు అక్క చెల్లెమ్మల చేతికి - లక్షల ఆస్తి వారి చేతికేపేదల ఇంటి స్థలాల కోసం 56,102.91 కోట్ల రూపాయల విలువచేసే 71,811.49 ఎకరాల భూమిని పంపిణీ చేయడం జరిగినదిఇల్ల నిర్మాణాలకు చేదోడుగా నిలిచేందుకు అవసరం అయిన ఇసుక, ఐరన్ వంటి మెటీరియల్ కోసం13,758 కోట్ల మరియు మౌలిక సదుపాయాల కల్పన కొరకు 36,026 కోట్ల రూపాయలు అదనంగా కర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.రాష్ట్రంలో మొత్తంగా ఇల్ల లబ్ధిదారులకు అన్ని రకాలుగా 1,05,886 కోట్ల రూపాయలు మేర ప్రభుత్వం అండగా నిలుస్తుంది - ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్వతీపురం రూరల్: జనసేన పార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్ మరియు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ పచ్చ మీడియాతో కలిసి నవరత్నాలు పేదలందరికీ ఇల్లు కార్యక్రమంపై దుష్ప్రచారం చేయడానికి పూనుకుని ఈరోజు, రేపు, ఎల్లుండి మూడు రోజులు పాటు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీ లేఔట్లలలో సందర్శిస్తున్న సందర్భంగా ఆ కార్యక్రమంపై తీవ్రంగా స్పందించిన పార్వతిపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఈరోజు ఆదివారం పార్వతీపురం మండలం, కృష్ణపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నాటి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకం అమలులో భాగంగా అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో 30.25 లక్షల మంది లబ్ధిదారులకు ఇల్లపట్టాలను అందజేయగా అందులో 21.25 లక్షల ఇల్ల నిర్మాణం జరుపుకోవడం జరుగుతుంది అని పీఎంఏవై - వైయస్సార్ అర్బన్ ఫేజ్ -1 లో 15.25 లక్షల ఇళ్లు, పీఎంఏవై - వైయస్సార్ అర్బన్ ఫేజ్ -2 లో 1.26 లక్షలు, పీఎంఏవై వైఎస్ఆర్ గ్రామీణ కింద 1.79 లక్షల ఇళ్లు, పీఎంఏవై - వైయస్సార్ ఏపిహెచ్ (టైట్కో) కింద 2.62 లక్షల ఇల్ల నిర్మాణాలు జరుపుకోవడం జరుగుతుంది అని ఎమ్మెల్యే తెలిపారు.దేశంలోనే ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో జరుగుతున్న అతిపెద్ద అభివృద్ధి పేదవారు అయిన ప్రతీ అక్కా, చెల్లెమ్మల జీవిత ఆశయం అయిన సొంతింటి కల నెరవేరుతున్న వేళ అది చూసి ఓర్వలేని ప్రతిపక్షం తెలుగుదేశం నాయకుడు చంద్రబాబు నాయుడు, వారి అనుబంధ పార్టీ జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ తో కలిసి ఆడుతున్న నాటకంలో భాగంగా నేడు నవరత్నాలు పేతులందరికీ ఇల్లు కార్యక్రమంపై దుష్ప్రచారం చేసేందుకు నడుంబిగించి జనసెనా పార్టీ, పవన్ కళ్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా మూడు రోజులపాటు ఆందోళన చేపట్టడం నిజంగా సిగ్గుచేటు అని, దీనిని ఎంత మాత్రం రాష్ట్ర ప్రజానికం హర్షించరని వారికి తగిన బుద్ధి చెప్పి తీరుతారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇదే పవన్ కళ్యాణ్ 2014-19 సంవత్సరంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ మూడు సెంట్లు చొప్పున స్థలం ఇచ్చి ఇల్లు నిర్మిస్తామని చెప్పినప్పుడు ఎన్ని కట్టిచ్చారు అని?, ఒక ఇల్లు అయినా కట్టించారా?, అప్పుడు అధికారపక్షంలో అంట కాగిన పవన్ కళ్యాణ్ ఏమి చేశారని, ఎందుకు ప్రశ్నించలేదని ఎమ్మెల్యే మీడియా ముఖంగా సూటిగా ప్రశ్నించారు.అలానే జనసేన పిల్ల నాయకులు పార్వతీపురం ప్రాంతంలో అక్కడక్కడ రురుగుతూ నలుగురు ప్రకార్థులు పట్టుకొని ఈ ప్రభుత్వంలో ఏమీ అభివృద్ధి జరగలేదని చేస్తున్న దుష్ప్రచారం పై జనసేన పార్టీకి గాని దాన్ని వెనకుండి నడిపిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు గాని ఒకటే స్పష్టంగా చెప్పదలుచు కున్నానని మన వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 నుంచి ఇప్పటివరకు సుమారుగా 11,700 ఇల్లు పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో మంజూరు కావడం జరిగిందని అందులో ఇప్పటికే 8,000 పై చిలుకు ఇల్ల నిర్మాణాలు ప్రారంభం కావడంతో పాటు వివిధ దశల్లో నిర్మాణాలు జరుపుకోవడం జరుగుతుంది అని, అదేకాకుండా ఈరోజు తాను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న కృష్ణపల్లి గ్రామంలో కూడా 124 లబ్ధిదారులకు ఇళ్లస్థలాలతో పాటు ఇల్లు మంజూరు చేయడం జరిగిందని అందులో ఇప్పటికే 123 ఇళ్ల నిర్మాణాలు జరుపుకోవడం కూడా జరుగుతుంది ఇదంతా వారికి కనిపించడం లేదా, ఇది అభివృద్ధి కాదా అని వారిని అడుగుతున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఇదే ఊర్లో గత ప్రభుత్వం ఒక్క సెంటు స్థలం కూడా ఏ ఒక్క పేదవానికి ఇవ్వకుండా ఏం చేసిందని ఏదురు ప్రశ్నించారు.రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల అభ్యున్నతికి, అక్కా చెల్లెమ్మల సొంతింటి కల నెరవేర్చడానికి చేస్తున్న కృషి ప్రజలందరికీ తెలుసని, తమ జగనన్న ప్రభుత్వం వచ్చాక తమకి ఎంతో మేలు జరిగిందని, తమకి కొండంత భరోసా ఇచ్చిందని, తమ కుటుంబముకి పెద్ద దిక్కుగా నిలిచిందని అక్క చెల్లెలు అందరూ భావిస్తున్నారని అటువంటి సందర్భంలో ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు గానీ, పవన్ కళ్యాణ్ గాని, పచ్చ మీడియా కానీ ఎవరెన్ని కుయుక్తులు పన్నినా, దుష్ప్రచారాలు చేసిన వాటిని నమ్మేస్థితిలో ప్రస్తుతం రాష్ట్ర ప్రజానికం లేరని వారికి గత ఎన్నికల్లో చెప్పినట్లే వచ్చే ఎన్నికల్లో కూడా తగిన బుద్ధి చెబుతారని, రెండు చోట్ల ఓడిపోయిన పవన్ కళ్యాణ్ గాని, 23 సీట్లతో సరిపెట్టుకున్న చంద్రబాబు నాయుడు గాని వచ్చే ఎన్నికల్లో అవి కూడా దక్కే పరిస్థితి లేకుండా చేసుకుంటున్నారని ఎమ్మెల్యే తీవ్రంగా ఏద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు మండల జడ్పిటిసి సభ్యులు బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, ఏఎంసి చైర్పర్సన్ ఎం భాగ్యశ్రీ, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, స్థానిక సర్పంచ్ బోను రామి నాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు, స్టేట్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు( సి హెచ్ డబ్ల్యూ ) సమస్యలు 10 రోజుల్లో పరిష్కరిస్తాం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం ఐటీడీఏ వద్ద సిఐటియు ఆధ్వర్యాన కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ తో కలిసి ధర్నా కార్యక్రమం సోమవారం చేపట్టారు. ధర్నా అనంతరం ఐటిడిఎ కార్యాలయం వద్ద ఉన్న ఏపీవో సురేష్ కి వినతిపత్రం అందజేసారు.అనంతరం ఐటీడీఏ నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి గ్రీవెన్సో ఉన్న ఐటీడీఏ పీవో విష్ణు చరణ్ కి వినతిపత్రంఅందజేశారు. వెంటనే ఐటీడీఏ పీవోగా స్పందించి పదిరోజుల్లో కమ్యూనిటీ హెల్త్వర్కర్స్ సమస్యల పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా పత్రికా విలేకరులతో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గొర్లె వెంకటరమణ సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు వాకాడఇందిర సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు నాయకులు అమల లక్ష్మి బేబి మాట్లాడుతూ పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో గల ఎనిమిది మండలాలకు సంబంధించి మక్కువ సాలూరు పాచిపెంట పార్వతీపురం కొమరాడ జియ్యమ్మవలస గరుగుబిల్లి గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేయుచున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్( సి హెచ్ డబ్ల్యూ ) కి నాలుగు నెలల నుంచి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని 2017 నుండి 2018 వరకు సుమారు 21 నెలకు సంబంధించి వేతన బకాయిలు చెల్లించాలని అదే విధంగా యూనిఫామ్ గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలని అలాగే అర్హులైన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా గుర్తించాలనిపని భారం తగ్గించాలని ఉద్యోగ భద్రత కల్పించాలని రాజకీయ వేధింపులు ఆపాలని తదితర సమస్యలపై ఈరోజు గ్రీవెన్సో ఐటీడీఏ పీవో కే వినతిపత్రం ఇవ్వడం జరిగిందని రాబోయే రోజుల్లో జీతాలు చెల్లించక పోతే కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ తో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు మంగ ఐమాక్స్ సత్యవతి పార్వతి లలిత సుభద్ర గౌరమ్మ పార్వతి వివిధ మండలాలకు చెందిన కమ్యూనిటీ వర్కర్లు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ బాలల దినోత్సవం



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** జాతీయ బాలల దినోత్సవం ను,జాతీయ బాలల దినోత్సవం పాటు అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో బాగంగా పార్వతీపురం ప్రభుత్వ ఉన్నత పాటశాలలో జిల్లా బాలల రక్షణ విభాగం మరియు ఐ ఆర్ పి డబల్యు ఏ సంస్థ వారి సంయుక్త0గా నిర్వహించే కార్యక్రమంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారి గొల్ల వరహాలు గారి అద్యక్షతన బాలల దినోత్సవం నిర్వహించడం జరిగింది. జ్యోతిప్రజ్వలనం చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ అందరూ అనుభవించే బాల్యం.. భగవంతుడు ఇచ్చిన ఓ అమూల్యమైన వరం అని మన దేశంలో ప్రతి సంవత్సరం నవంబరు 14 న బాలల దినోత్సవం జరుపుకుంటాము. భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. నెహ్రూకు పిలల్లలతో వున్న బాంధవ్యాన్ని తెలుపుతూ ఈ ఉత్సవం జరుపుకుంటారు. పిల్లలు నెహ్రూను చాచా నెహ్రూ అని ప్రేమగా పిలిచేవారు ఆమె ఈ సందర్బంగా మాట్లాడారు, ఈ కార్యక్రమ0 లో సి డబ్ల్యూ సి మెంబెర్ పట్నాయక్ పిల్లల్ని ఉద్దేశించి నేటి బాలలే రేపటి పౌరలు అని బాల్యం నుంచి చదువు మిద శ్రద్ధ వహించి తల్లిదండ్రులు కు మరియు సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకొవాలని అయన సూచించారు. ఈ సందర్బంగా ప్రభుత్వ ఉన్నత పాటశాల హెడ్ మాస్టార్ పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమణగారు అడ పిల్లల్ని ఉద్దేశించి మట్లాడుతూ నేటి సమాజంలో వారు ఎదుర్కుంటున్న లైంగిక వేదింపుల పట్ల జాగ్రతగా ఉండాలని సూచించడం జరిగింది. ఈ సందర్బంగా ఐ ఆర్ పి డబల్యు ఏ సంస్థ డైరెక్టర్ ప్రకాష్ పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది, ఈ సందర్భంగా ముఖ్య అతిదులతో బాలల హక్కుల వారోత్సవాలు పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది , ఈ కార్యక్రమంలో ఐ ఆర్ పి డబల్యు ఏ సంస్థ సిబ్బంది యం ప్రసన్న కుమారి, యస్ సత్యనారాయణ , చిహేచ్ వినీత్ , గణేష్ , దయామని పాల్గొనడం జరిగింది.

# సంపూర్ణ కార్తీక మహాపురాణం

## (నిత్య పారాయణ గ్రంథము)

**ఇరువది రెండవ రోజు పారాయణము**

**త్రయోదశాధ్యాయము**

**నారద ఉవాచ:** ఓ పృథురాజా! రాహువు చెప్పిన విషయాలన్నీ వినగానే, క్రోధోద్రిక్తుడయిన జలంధరుడు శివుని మీద రణ భేరీ వేయించాడు. కోట్లాది సేనలతో - కైలాసం వైపుకు దండు కదిలాడు. ఆ సందర్భంగా - జలంధరునికి అగ్రభాగాన వున్న శుక్రుడు రాహువు చేత చూడబడ్డాడు. తత్ఫలితంగా జలంధరుడి కిరీటం నేలకి పడింది. రాక్షస సేవా విమానాలతో క్రిక్కిరిసిన ఆకాశం - వర్షాకాలపు మేఘావృతమైన ఆకాశం వలె కనిపించసాగింది. ఈ రణోద్యోగాన్నెరిగిన దేవతలు ఇంద్రుణ్ని ముందర వుంచుకుని రహస్య మార్గాన శివుడి సన్నిధికి వెళ్లి - యుద్ధవార్తల్ని విన్నవించారు. 'ఓ దేవాదిదేవా! ఇన్నినాళ్లుగా వాని వల్ల మేము పడుతున్న ఇక్కట్లన్నీ నీకు తెలియును. ఈ వేళ వాడు నీ మీదకే దండెత్తి వస్తున్నాడు. సర్వలోక కళ్యాణార్థం వానిని జయించు తండ్రీ! అని ప్రార్థించారు. వెనువెంటనే విరూపాక్షుడు విష్ణువును స్మరించాడు - విష్ణువు వచ్చాడు. అప్పుడు శివుడాయనను చూచి 'కేశవా! గత జగడంలోనే ఆ జలంధరుడిని జమునిపాలు చేయకపోయావా? పై పెచ్చు వైకుంఠాన్ని కూడా వదిలి వాడింట కాపురముండట మేమిటి?' అని ప్రశ్నించాడు. అందుకు జవాబుగా విష్ణువు 'పరమేశ్వరా! ఆ జలంధరుడు నీ అంశ వలన పుట్టడం చేతా, లక్ష్మికి సోదరుడు కావడం చేతా - యుద్ధంలో నా చేత వధింపబడలేదు. కాబట్టి, నువ్వే వానిని జయించు' అని చెప్పాడు. అందు మీదట శివుడు - 'ఓ దేవతలారా ! వాడు మహాపరాక్రమవంతుడు. ఈ శస్త్రాస్త్రాలవల్లగాని, నా చేతగాని మరణించేవాడు గాదు. కాబట్టి, మీరందరూ కూడా ఈ అస్త్రశస్త్రాలలో మీ మీ తేజస్సులను సయితం ప్రకాశింప చేయాలి' అని ఆజ్ఞాపించటంతో, విష్ణ్వాది దేవతలందరూ తమ తమ తేజస్సులను బయల్పరిచారు. గుట్టగా ఏర్పడిన ఆ తేజస్సులో శివుడు తన తేజాన్ని కలిపి - మహొత్తమమూ, భీషణ జ్వాలాస్యము వేగసంపన్నమూ, అత్యంత భయంకరమూ అయిన 'సుదర్శన 'మనే చక్రాన్ని వినిర్మించాడు. అప్పటికే - ఒక కోటి ఏనుగులు, ఒక కోటి గుర్రాలు, ఒక కోటి కాల్బలగముతో కైలాసభూములకు చేరిన జలంధరుని దేవతలూ ప్రమధగణాలూ ఒక్కుమ్మడిగా ఎదుర్కొన్నాయి. నందీశ్వర, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరాదులు కూడా తమ తమ గణాలతో సహా - జలంధరునిని



మార్కొన్నారు. రెండు తెగల మధ్యనా భయంకరమయిన సంకుల సమరం కొనసాగింది. ఇరుపక్షాల నుంచి వచ్చే వీర రస ప్రేరకాలయిన భేరీ మృదంగ శంఖాది ధ్వనులతోనూ, రథనేమి ధ్వనులతోనూ, గజ ఘీంకారాలతోనూ - భూమి విపరీతమైన ధ్వనులతో ప్రకంపించసాగింది. పరస్పర ప్రయోజితాలైన - శూల, పట్టిస, తోమర, బాణ శక్తి, గదాద్యా యుధ భరితమైన ఆకాశం - పగలే చుక్కలు పొడిచినట్లుగా వుంది. యుద్ధభూమిలో నేలకూలిన రథగజాదుల కళేబరాలు రెక్కలు తెగిన పర్వతాలు గుట్టలు పడినట్లుగా వున్నాయి. ఆ మహాహవంలో ప్రమధబాణోపహతులైన దైత్యుల్ని శుక్రుడు మృత సంజీవనీ విద్యతో పునర్జీవింప చేయసాగాడు.

ఈ సంగతి ఈశ్వరుని చెవిన పడింది. తక్షణమే ఆయన ముఖం మంచి కృత్య అనే మహాశక్తిని ఆవిర్భవించింది. అది, అత్యంత భయంకరమైన తాలు జం ఘోదర వక్ష స్తనాలతో మహావృక్షాలను సైతం కూలగొడుతూ రణస్థలిని చేరింది.

**శ్లో॥ సా యుద్ధభూమి మాసాద్య భక్షయంతీ మహాసురాన్**

**భార్గవం స్వభ గోధృత్వా జగా మాంతర్హితా నభః ॥**

రావడం రావడమే పేరు మోసిన రాక్షసులెందరినో తినేసింది. ఆ వూపు ఊపు శుక్రుణ్ని సమీపించి అతనిని తన యోనిలో చేర్చుకుని అంతర్ధానమై పోయింది. మరణించిన వాళ్లను మళ్లా బ్రతికించే శుక్రుడు లేకపోవడం వలన - ప్రమథగణాల విజృంభణకు రాక్షస సేన మొత్తం తుఫాను గాలికి చెదిరిపోయే మబ్బు తునకలవలె చెల్లా చెదరయి పోసాగింది. అందుకు కినిసిన శుంభనిశుంభ కాలనేమ్యాది సేనానాయకులు అగణ శరపరంపరతో శివగణాలను నిరోధింపసా గేరు. చక్కటి పంట మీద మిడుతల దండులాగా - తమ మీద పడే రాక్షస బాణాలకు రక్తసిక్త దేహులై, అప్పుడే పూసిన మోదుగ చెట్ల వలె తయారయిన శివ సేనలన్నీ తిరుగుముఖం పట్టి పారిపోసాగాయి. అది గమనించిన - నందీశ్వర, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వరులు అగ్రహావేశులై - రాక్షస సేనల మీదకు విజృంభించారు.

**త్రయోదశోధ్యాయ స్సమాప్తః (పదమూడవ అధ్యాయము సమాప్తము)**

**చతుర్థశాధ్యాయము**

నందీశ్వరుడు కాలనేమితోనూ, విఘ్నేశ్వరుడు శుంభుడితోనూ, కుమారస్వామి నిశుంభుడితోనూ ద్వంద్వ యుద్ధాలకి తలపడ్డారు. నిశుంభుడి బాణఘాతానికి సుబ్రహ్మణ్య (కుమార) స్వామి వాహనమైన నెమలి మూర్ఛపోయింది. నందీశ్వరుడు తన బాణ పరంపరతో కాలనేమి యొక్క గుర్రాలనూ, జెండానూ, ధనుస్సునూ, సారథినీ నాశనం చేసేశాడు. అందుకు కోపించిన శుంభుడు విఘ్నేశ్వరుడి వాహనమైన ఎలుకని బాణంతో బాధించాడు. అది కదలలేని పరిస్థితి ఏర్పడటంతో, వినాయకుడు గండ్రగొడ్డలిని ధరించి - కాలినడకను శుంభుని చేరి వాని వక్షస్థలాన్నీ గాడనేశాడు. వాడు భూమిపై పడిపోయాడు. అది గమనించిన కాలనేమి - నిశుంభులు ఇద్దరూ ఒకేసారిగా గణపతితో కలియబడ్డారు. దీనిని గుర్తించి వారి మధ్యకు రంగప్రవేశం చేశాడు వీరభద్రుడు. వినాయకునికి సహాయార్థమై వీరభద్రుడు కదలగానే కూశ్మాండ-భైర - బేతాళ- పిశాచ-యోగినీ గణాలన్నియు ఆయననున అనుసరించాయి. గణసహితుడైన వీరభద్రుని విజృంభణతో రాక్షసగణాలు హాహాకారాలు చేశాయి. అంతలోనే మూర్ఛ దేరిన నందీశ్వర, కుమారస్వాములిద్దరూ పునః యుద్ధంలో ప్రవేశించారు. వాళ్లందరి విజృంభణతోనూ వీగిపోతూన్న తన బలాన్ని చూసిన జలంధరుడు 'అతి' అనే పతాకం గల రథంపై వచ్చి ఈ సమస్త గణాలనూ ఎదుర్కొన్నాడు. జలంధరుడి బాణాలతో భూమ్యాకాశాల మధ్య ప్రాంత మంతా నిండిపోయింది. అయిదు బాణాలతో విఘ్నేశ్వరుడినీ, తొమ్మిది బాణాలతో నందీశ్వరుడినీ, ఇరవై బాణాలతో వీరభద్రుడిని కొట్టి మూర్ఛ పొగొట్టి భీషణమైన సింహగర్జన చేశాడు. వాడి గర్జనతో ముందుగా స్పృహలోనికి వచ్చిన వీరభద్రుడు, ఏడు బాణాలతో జలంధరుడి గుర్రాలనీ, పతాకాన్నీ గొడుగునూ నరికేసాడు. మరో మూడు బాణాలు అతని గుండెలలో గుచ్చుకునేలా నాటాడు. దానితో మండిపడిన జలంధరుడు 'పరిఘ' అనే ఆయుధంతో వీరభద్రుని ఎదుర్కొన్నాడు. అద్భుతమైన యుద్ధం చేశారు వాళ్లు. అనంతరం జలంధరుడు వీరభద్రుడి తలపై పరిఘను ప్రయోగించడంతో - వీరభద్రుడు స్పృహ తప్పి పడిపోయెను. చివరికి దేవతల ప్రార్థనల మీద శివుడు జలంధరుడితో యుద్ధానికి ఉపక్రమించాడు. అతడిని యుద్ధంలో జయించడం శివుని శక్యం కాలేదు.

జలంధరుడు హతుడు కాకపోవడానికి అతని భార్య బృంద పాతివ్రత్యం కారణమని విష్ణుమూర్తి గ్రహించాడు. ఆమె ముందు విష్ణు మాయను ప్రయోగించడానికి బయలు దేరాడు. అక్కడ బృంద ఒక మునీశ్వరుని వద్దకు వెళ్ళి తన భర్త యోగక్షేమాల గురించి అడిగింది.

**పదమూడు, పదునాలుగు అధ్యాయములు ఇరువది రెండవ (బహుళ సప్తమి) రోజు పారాయణము సమాప్తము**

# షుగర్ ఉన్నవారు నెయ్యి తినొచ్చు



ఈ సంవత్సర థీమ్.. బెటర్ యాక్సెస్ టూ క్వాలిటీ డయాబెటిస్ ఎడ్యుకేషన్.. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఫేమస్ న్యూట్రిషనిస్ట్, ఆథర్ రుజుతా దివేకర్ ఇటీవల షుగర్ గురించి కొన్ని అపోహలను, ఆమె ఆడియో బుక్ ఈటింగ్ ఇన్ ది ఏజ్ ఆఫ్ డైటింగ్‌లో చేయాల్సిన సరైన పనిని తొలగించారు.

అన్ని పండ్లలో సహజంగానే చక్కెర్లు ఉంటాయి. ఎక్కువగా ఫ్రక్టోజ్, ఇది తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుందని రుజుత తన ఆడియో బుక్ ఆన్ ఆడిబుల్‌లో చెప్పింది. ప్రజల్లో ఈ సాధారణ అపోహను పటా పంచలు చేస్తూ ఆమె ఇలా రాసింది. అరటిపండును అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్ ఆమోదించింది. అయితే దాని మూలం దేశంలోని వైద్యులు, డైటీషియన్లకు కాస్తా దూరంగానే ఉంది.. అరటిపండి కేవలం మంచది మాత్రమే కాదు. షుగర్ ఉన్నవారు కూడా తినొచ్చు. ఎందుకంటే ఇందులో ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. హై బీపిని కూడా తగ్గిస్తుంది.

షుగర్ తినకుండా.. బిస్కెట్స్ తినొచ్చా..

మీ చాయ్‌లోని టీ స్పూన్ లేదా, రెండు చక్కెరలు తక్కువ గ్రేడ్ షుగర్, ట్రాన్స్ ఫ్యాట్, ఎమల్సిఫైయర్, రిచ్ బిస్కెట్ క్రాకర్ కంటే ఎక్కువగా ఉంటాయని రుజుతా చెబుతున్నారు. అదే విధంగా.. ప్రమాదం ఎప్పుడు ఉంటుందంటే... మనం నియంత్రణ లేకుండా పుడు తీసుకోవడం, ఏది మంచిది, ఏది చెడు అని తెలుసుకోకపోవడం. కాబట్టి. చక్కెర కలిపిన టీ తాగండి. కానీ, అది తక్కువ మాత్రమే తాగండి. అదే విధంగా బిస్కెట్స్‌కి కాస్తా దూరంగా ఉండడమే మంచిది.

నెయ్యి తినొచ్చా..

ఏ విషయంలో అయినా నిజం తెలుసుకోవాలి. నెయ్యి, కొబ్బరి.. రెండింటిలోనూ అవసరమైన కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి ఇన్సులిన్‌కి మరింత హెల్ప్ చేస్తాయి. గుండెను రక్షిస్తాయి. పేగు శ్లేష్మాన్ని నిర్వహిస్తాయి. కాబట్టి మీరు డయాబెటిక్ అయినప్పటికీ.. నెయ్యిని హ్యాపీగా తినొచ్చు. అయితే ముందుగా చెప్పినట్లు క్వాంటిటీ అనేది చూసుకోవడం చాలా ముఖ్యమని రుజుత చెబుతోంది.

**వర్కౌట్..ఏం చేయాలి..** మనలో చాలా మంది రోజూ నడిస్తే సరిపోతుందని అనుకుంటారు. కానీ.. బరువులు ఎత్తడం, జిమ్‌లో చేరడం, కండరాల ఎక్సర్‌సైజెస్ చేయడం కూడా బలాన్ని పెంచుతుంది. ఎందుకంటే, శరీరం నుండి బలం కోల్పోవడం ఇన్సులిన్ నిరోధకత, మధుమేహం ఇవి ముడిపడి ఉంటాయి. మీకు ఆల్రెడీ షుగర్ ఉంటే జిమ్ మీకు మంచి వర్కౌట్.

**డయాబెటిస్ తగ్గదు..** ఇది ఏమాత్రం నిజం కాదు. ఫుడ్, వర్కౌట్, లైఫ్‌స్టైల్ సరిగ్గా ఉంటే రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రించొచ్చు. ఇన్సులిన్ పనితీరుకు మద్దతు ఇవ్వడం చాలా ఈజీ అని రుజుతా దివేకర్ ఆడియోబుక్ ఆన్ ఆడిబుల్‌లో చెప్పారు. ఎప్పటికీ స్థానిక, సాంప్రదాయ ఆహారం మంచిది. సాంప్రదాయ, స్థానిక, సీజనల్ ఫుడ్స్ తినడం ఆరోగ్యంగా ఉండడంలో ఈజీ అండ్ ఎఫెక్టివ్ ఆప్షన్. స్థానిక ఆహారపు అలవాట్లకు క్రమపద్ధతిలో దూరంగా ఉన్నవారు, కొత్త అలవాట్లను చేసుకున్నవారు, అధిక బరువు, అనారోగ్యం, షుగర్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు.

# కాలీఫ్లవర్‌తో ఇలా చేసి తింటే బరువు తగ్గుతారట



కాలీఫ్లవర్ బరువు తగ్గేందుకు బెస్ట్ ఫుడ్. కాలీఫ్లవర్ తక్కువ కార్బ్స్ ఉన్న కూరగాయ. కీటో ఫ్రెండ్లీ వెజిటేబుల్. వీటిని ఫాలో అయ్యేవారికి మాంచి వంటకాలు ఉన్నాయి.

**కాలీఫ్లవర్ కూర..** ముందుగా ప్యాన్లో నూనె వేసి వేడి చేయాలి. జీలకర్ర వేసి చిటపటలాడాక, వెల్లుల్లి తురుము, అల్లం తురుము వేసి ఫ్రై చేయాలి. ఇప్పుడు పసుపు, కారం, ధనియాల పొడి వేసి మంటను సిమ్ చేయాలి. మసాలా దినుసులు వేయండి. తర్వాత టమాట, 1 పచ్చిమిర్చి వేసి వేడి చేయండి. బాగా ఫ్రై అయ్యాకు.. సిమ్ టూ నార్మల్ మంట వరకూ ఫ్రై చేయండి. తరిగిన కాలీఫ్లవర్ని వేసి బాగా కలపండి. రుచికి సరిపడా ఉప్పు వేసి కలపండి.కూర రెడీ అవ్వడానికి 1 కప్పు నీరు వేయండి. పాన్ని మూత పెట్టి, తక్కువ నుండి మీడియం మంటపై ఉడికించాలి. కాలీఫ్లవర్ ఉడికిన తర్వాత, మెంతి, గరం మసాలా పొడి వేసి కలపాలి. చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేయాలి.

**కాలీఫ్లవర్ కార్న్ సూప్..** ప్యాన్లో నూనె వేసి వేడి చేయండి. కొన్ని ముక్కలు వేసి ఫ్రై చేయాలి. తర్వాత వెల్లుల్లి తరుగు వేయండి. ఇప్పుడు అందులో కాలీఫ్లవర్ వేసి 2 నుంచి 3 నిమిషాల పాటు ఫ్రై చేయాలి. తర్వాత కొన్ని జీడిపప్పులు వేసి పేస్ట్ చేసి అది వేయండి. మూత పెట్టి మీడియం మంటపై ఉడికించండి. తర్వాత, కాసేపు చల్లారనివ్వండి. ఈ మిశ్రమాన్ని బ్లెండర్లో వేసి.. బ్రెడ్ ముక్కలు వేసి మెత్తటి పేస్ట్ మిక్సీ పట్టండి. పిండిని పాన్లోకి తీసుకుని పాలు, మిరియాల పొడి, ఫ్రెష్ క్రీమ్, చక్కెర, రుచి కోసం ఉప్పు కలపండి.

**తందూరీ గోబి..** మసాలా చేసేందుకు ముందుగా అన్ని మసాలా దినుసులను మెత్తగా పొడిగా మిక్సీ పెట్టాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, పెరుగు, కాస్తా నూనె, కారం, మిరియాల పొడిని ఓ బ్లెండర్లో వేసి ఓ సారి కలపాలి. దీంతో కాలీఫ్లవర్ ముక్కల్ని మెరినేట్ చేయండి. గోబీ కోసం బార్బెక్యూ స్కేవర్స్ని వాడండి. ఇప్పుడు వీటిని కొంచెం నూనెతో బ్రష్ చేసి 2 నుంచి 3 నిమిషాల పాటు ఉడికించండి. పైన కొద్దిగా చాట్ మసాలా, నిమ్మరసం చల్లేయండి.

**కాలీఫ్లవర్ స్టిర్ ఫ్రై..** తవాలో నూనె వేడి చేసి, కాలీఫ్లవర్, రుచికి ఉప్పు వేసి మీడియం మంటపై 2 నిమిషాలు వేయించాలి. తవాను ఓ మూతతో కప్పి, తక్కువ మంటపై 8 నిమిషాలు ఉడికించాలి. తక్కువ నీరు పోసి మళ్ళీ మూతపెట్టి ఉడికించండి. 2 నుంచి 3 నిమిషాల పాటు సిమ్లో పెట్టి ఉడికించండి. మధ్యమధ్యలో టాస్ చేయండి. మంటను ఆపేసి.. వెల్లుల్లి పొడి, మిరియాల పొడర్ వేసి సర్వ్ చేయండి.

**హనీ కాలీఫ్లవర్..** కార్న్ ఫ్లోర్, ఉప్పు, మిరియాల పొడి, గుడ్లు, నీటిని కలిపి పిండిని రెడీ చేయండి. కడాయిలో నూనె వేసి వేడి చేయండి. కాలీఫ్లవర్ని పిండిలో ముంచి, నూనెలో వేసి గోల్డెన్ బ్రౌన్ రంగులోకి వచ్చే వరకు ఫ్రై చేయాలి. నూనెనుండి తీసి అబ్జార్బింగ్ పేపర్పై వేయండి. ఇప్పుడు తేనె, వెన్న, నిమ్మరసం కలిపి కాలీఫ్లవర్పై వేసి బాగా కలపండి. వేడిగా సర్వ్ చేయండి.

# చలికాలపు సాయంత్రాలు.. వేడి వేడి టీ తో పాటు ఈ వెరైటీ సమోసాలు



భారతీయ సాంప్రదాయ వంటకాల్లో సమోసా గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఉదయమైనా, సాయంత్రమైనా వేడి వేడి టీ తో సమోసా తింటుంటే ఆహా.. ఆ హాయే వేరు. రుచికరమైన చిరుతిళ్లకు భారతీయ సంస్కృతికి అవినాభావ సంబంధం ఉంది. ఇది మన రోజువారీ అలవాట్లలో ఒక ముఖ్యమైన భాగం. కచోరీ, వడ పావ్ మొదలైన దేశమంతటా ప్రసిద్ధి చెందిన వంటకాలు, ప్రాంతీయ వంటకాలు, స్ట్రీట్ ఫుడ్స్ కు మన దేశంలో కొదవ లేదు. కొన్ని ప్రాంతాలు అక్కడ లభించే ఆహార పదార్థాలతోనే ఫేమస్ అయ్యాయంటే అతిశయోక్తి కాదు. సమోసాలు దేశవ్యాప్తంగా అందరూ ఇష్టంగా తినే ఈవ్ నింగ్ స్నాక్ ఐటమ్. సమోసాను ఇష్టపడే వారందరూ వివిధ రకాలుగా సమోసాలను ట్రై చేస్తుంటారు.

చీజ్ చిల్లీ సమోసా.. చీజ్‌కి ఎవరూ నో చెప్పలేరు. సమోసాను చీజ్ తో కలిపి తింటుంటే ఆ కిక్కే వేరు. సాయంత్రం చిరుతిండి చీజీగా, స్పైసీగా ఉండాలని ఇష్టపడే వారందరికీ చీజ్ చిల్లీ సమోసా కంటే మెరుగైనది ఏమీ ఉండదు. ఇది దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా అందుబాటులో ఉంది.

పంజాబీ ఆలూ సమోసా.. పంజాబీ ఆహారాన్ని ఇష్టపడేవారే కాకుండా సమోసా తినని వారు కూడా పంజాబీ ఆలూ సమోసా రుచి చూస్తే అస్సలు వదిలిపెట్టరు. పంజాబీ మసాలా దినుసులతో కూడిన ఈ పర్ఫెక్ట్ ఫ్యూజన్ సాయంత్రం టీ కోసం తయారైన అద్భుతమైన స్నాక్.

కార్న్ మసాలా సమోసా.. మొక్కజొన్న చాలా కాలం నుంచి ప్రజలకు ఇష్టమైన చిరుతిండిగా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా చలికాలంలో మసాలా మొక్కజొన్నకు బాగా గిరాకీ ఉంటుంది. అయితే శరీరానికి కావాల్సిన దానికంటే ఎక్కువగా మసాలాలను తీసుకుంటే ఆరోగ్య సమస్యలు వస్తాయి. కాబట్టి కార్న్ మసాలా సమోసాను మితంగా తీసుకోవడం మంచిది.

సమోసా అభిమానులకు సాయంత్రం అల్పాహారం సమోసాలకు సంబంధించినది. వేయించిన సమోసాతో వేడి వేడి టీ.. అనే ఆలోచే సమోసా ప్రియులకు ఓ రకమైన ఆనందంలో పడేస్తుంది. ముఖ్యంగా చీజ్ చిల్లీ సమోసా, కఢై పనీర్ సమోసా మొదలుకొని మసాలా కార్న్ సమోసా, వెజ్జీ సమోసా, పంజాబీ ఆలూ సమోసా వరకు అనేక రకాల సమోసాలు అందుబాటులోకి వస్తున్నాయి.

# మధ్యాహ్నం భోజనం తిన్న వెంటనే నిద్ర వస్తోందా.?



చాలామందికి మధ్యాహ్నం భోజనం తిన్న వెంటనే నిద్ర వస్తుంది. కొందరికి అయితే కాసేపు పడుకుంటేనే గానీ.. హుషారు ఉండదు. ఇంతకీ అసలు అన్నం తిన్న వెంటనే ఎందుకు నిద్ర వస్తుంది.? అన్నంలోని గ్లూకోజ్ రక్తంలో వేగంగా కలవడం వల్ల భోజనం చేసిన వెంటనే నిద్రమత్తుగా అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. అన్నంతో మెలటోనిన్, సెరటోనిన్ లాంటి ప్రశాంతతను కలగజేసే హార్మోన్లు విడుదలవుతాయని.. ఇవి ప్రశాంతతను, విశ్రాంతిని, మత్తును కలగజేస్తాయని అంటున్నారు. అన్నం మాత్రమే కాదని.. పలు రకాల పిండి పదార్థాలతోనూ ఇలాగే అనిపిస్తుందన్నారు.

సహజంగా మధ్యాహ్నం వేళ మనలో శక్తి తగ్గుతుంది. దానికి అన్నం కూడా తోడవ్వడంతో నిద్ర వెంటనే ముంచు కొస్తుంది. అందుకే ప్రొటీన్లు, విటమిన్లు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తినడం మంచిది. అలా తినడం వల్ల డొపమైన్, ఎపినెఫ్రిన్ లాంటి చురుకైన రసాయనాలు మెదడు వేగాన్ని పెంచడమే కాదు.. శరీరానికి కావాల్సిన శక్తిని కూడా ఇస్తాయి.

మరిన్ని దీన్ని చెక్ పెట్టడం ఎలా..?

మధ్యాహ్నం వేళ అన్నం తినాలంటే.. మాములు బియ్యం బదులుగా బాస్మతి బియ్యం వాడటం మంచిది. వీటిల్లో గ్లూకోజ్ త్వరగా రక్తంలో కలవదు. అంతేకాకుండా మధ్యాహ్నం సమయంలో అన్నం కొద్దిగా తినండి.

జొన్న, సజ్జ, గోధుమ రొట్టెలు, కూరగాయలు, సలాడ్‌తో కలిపి చికెన్ తీసుకున్నా మీకు కడుపు నిండిన భావన కలుగుతుంది. నిద్రమత్తు అనిపించదు.

# ఈ ఆహారాలను రాత్రుళ్లు అస్సలు తినకూడదు



ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఎవ్వరూ కూడా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించట్లేదు. అందుకే ఆరోగ్యంగా ఉండేందుకు చాలామంది జిమ్‌లలో తెగ కష్టపడాల్సి వస్తోంది. పర్యావరణ మార్పులు, ఆహారం, జీవనశైలి.. ఇలా మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. శరీరం ఎలప్పుడూ ఆరోగ్యవంతంగా ఉండాలంటే పోషకాహారం తినడం తప్పనిసరి. రోజంతా యాక్టివ్‌గా ఉండేందుకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో పోషకాలు నిండిన ఆహారం తీసుకోవడమే కాదు.. రాత్రుళ్లు తీసుకునే ఆహారంలోనూ కొన్నింటికి దూరంగా ఉండాలి.

ఆలుగడ్డ: బంగాళదుంపలలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. వీటిని రాత్రుళ్లు తీసుకోకూడదు. శరీరానికి కావాల్సిన శక్తిని తక్కువ సమయంలో అందించే గుణం కలిగిన బంగాళదుంపలను బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోవడం మంచిది.

వరి అన్నం: వరి అన్నాన్ని రాత్రిపూట తినకూడదు. రాత్రిపూట బదులుగా వరి అన్నం మధ్యాహ్నం తినడం మంచిది. ఇక రాత్రుళ్లు వరి అన్నం బదులుగా గోధుమ పిండితో చేసిన రొట్టెలు తినడం మేలు.

పెరుగు: పెరుగు రాత్రిపూట తీసుకోవడం మంచిది కాదు. ఎందుకంటే పెరుగు త్వరగా జీర్ణం కాదు. కేవలం పగటి వేళలో మాత్రమే తినాలి.

మాంసం: పెరుగులాగే మాంసం కూడా త్వరగా జీర్ణం అవ్వదు. మాంసం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందుకే దీన్ని మధ్యాహ్నం తినడం మంచిది.

పాలు: పాలు జీర్ణం అవ్వడానికి ఎక్కువ టైం పడుతుంది. అందుకని రాత్రివేళ తీసుకోవడం మంచిది.

మరోవైపు అరటిపండ్లు శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. వీటిని బ్రేక్‌ఫాస్ట్‌లో తీసుకోవడం మంచిది. ఇక ఆపిల్‌లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. పాలతో కలిపి ఆపిల్‌ను అస్సలు తీసుకోకూడదు. ఇక మొలకెత్తిన విత్తనాలు, గింజలను నిద్రలేవగానే తీసుకుంటే శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఇవే కాకుండా చాక్లెట్లు, పుల్లని పండ్ల రసాలు, టమాటా సాస్, పిజ్జా, కాఫీ, టీ లాంటి వాటిని రాత్రుళ్లు అస్సలు తీసుకోకండి. ఈ ఆహారాలు తినడం వల్ల సరిగ్గా నిద్రపట్టకపోవచ్చు. కాబట్టి.. వీటికి దూరంగా ఉండటం మంచిదని వైద్యుల సూచన.

# పొగాకు మానేయడం వల్ల క్యాన్సర్ ప్రమాదాన్ని 40శాతం వరకు తగ్గించవచ్చు..?



ప్రపంచవ్యాప్తంగా అధిక మరణాలకు ప్రధాన కారణం క్యాన్సర్.. 2020లో దాదాపు 10 మిలియన్ల మరణాలకు క్యాన్సర్ కారణమైందని నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం భారతదేశంలో దాదాపు 45 లక్షల మంది క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. దేశంలో దాదాపు 40 నుండి 50 శాతం క్యాన్సర్ కేసులు చికిత్సకు సవాలుగా మారుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఇలాంటి సందర్భంలో మరణాల రేటు ఎక్కువగా నమోదవుతుందని చెబుతున్నారు. ఈ వ్యాధి చికిత్స సమయంలో రోగి మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని పేర్కొంటున్నారు.

భారత ఆరోగ్య వ్యవస్థ క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. "భారతీయ వైద్యులు ఎన్నో మైలు రాళ్లను అధిగమించారన్నారు. చాలా కాలంగా రోగులు ఇన్ఫెక్షన్ సమస్యతో పోరాడుతున్నారు. లక్షణాలను చూసిన తర్వాత కూడా, క్యాన్సర్ వచ్చే అవకాశం లేకపోలేదు.. క్యాన్సర్ కోసం పరీక్షించడం కంటే సంక్రమణకు చికిత్స చేయడం వారి మొదటి ప్రతిస్పందనగా ఉంది.. కాబట్టి వైద్యులు కూడా క్యాన్సర్ వివిధ లక్షణాల గురించి తెలుసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు.

**భారతదేశంలోని మొత్తం కేసులలో 40% నోటి క్యాన్సర్..**

పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "వయస్సుతోపాటు క్యాన్సర్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. 50 ఏళ్లు పైబడిన వారు ముఖ్యంగా క్యాన్సర్ లక్షణాలు.. వారితో సంబంధం ఉన్న అసాధారణ ఆరోగ్య సమస్యల గురించి అప్రమత్తంగా ఉండాలి" అని చెప్పారు.

పెంధార్కర్ ప్రకారం.. భారతదేశంలో క్యాన్సర్‌కు నాలుగు ప్రధాన కారణాలు పొగాకు, ఆల్కహాల్, ఊబకాయం, HPV (హ్యూమన్ పాపిల్లోమావైరస్), హెపటైటిస్‌తో సహా వైరల్ ఇన్ఫెక్షన్లు. ప్రారంభ రోగనిర్ధారణ ద్వారా క్యాన్సర్ కు విజయవంతమైన చికిత్స సాధ్యమవుతుంది. అయితే ఇది దాని ప్రారంభ సంకేతాలు, లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు.

భారతదేశంలోని మొత్తం క్యాన్సర్ కేసులలో 40 శాతం ఓరల్ క్యాన్సర్‌కు కారణమని ఆయన అన్నారు. పొగాకును నమలడం, ధూమపానం చేయడం లేదా జర్దా తినడం.. ఇలా వివిధ రూపాల్లో పొగాకును ఉపయోగించడం దీనికి ప్రధాన కారణం. జీవితం నుంచి పొగాకును తొలగించడం ద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశాన్ని 40 శాతం తగ్గించవచ్చు.

**నోటి క్యాన్సర్ ప్రారంభ సంకేతాలు : లక్షణాలు..**

నోటి క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడం కొంచెం సులభం అని పెంధార్కర్ చెప్పారు. ఎందుకంటే ఇది సాధారణంగా నోటిలో ఉంటుంది.. కంటితో కనిపిస్తుంది. పొగాకు నమిలే వారికి క్యాన్సర్ సంకేతాలను ముందుగా గుర్తించేందుకు వారి నోటిని క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోవాలని సూచించారు.

నోటి పుండ్లు, చిగుళ్ల వాపు, పళ్ల తోముకునేటప్పుడు నోటి నుంచి రక్తం కారడం, మెడ భాగంలో వాపు, నొప్పి వంటివి క్యాన్సర్‌కు ముందస్తు సంకేతాలని పెంధార్కర్ చెప్పారు. అటువంటి సందర్భాలలో మీరు వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. క్యాన్సర్ అనుమానం ఉంటే.. డాక్టర్ దాని కోసం కణజాల బయాప్సీ చేస్తారు.

పొగాకు నమిలేవారికి నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. చాలా ఆలస్యంగా నిర్ధారణ అయినట్లయితే, రోగికి సంవత్సరాల తరబడి ఖరీదైన చికిత్స చేసినప్పటికీ నెమ్మదిగా, బాధాకరమైన మరణాన్ని పొందవలసి ఉంటుందని డాక్టర్ పేర్కొన్నారు. పొగాకు వినియోగాన్ని నియంత్రించడం, క్యాన్సర్ హెచ్చరిక సంకేతాలను తెలుసుకోవడం ఈ ప్రమాదాన్ని తగ్గించడానికి ఏకైక మార్గం అని ఆయన చెప్పారు.

# సర్వరోగనివారిణి డ్రాగన్ ఫ్రూట్



ప్రతిరోజూ పండ్లు తింటే ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుందన్న విషయం అందరికీ తెలుసు.. అలాంటి పండ్లలో డ్రాగన్ ఫ్రూట్ పేరు వినే ఉంటారు. దీనిని పలు రకాల పేర్లతో పిలుస్తారు. పేరుకు తగినట్లే.. డ్రాగన్ ఫ్రూట్ ప్రయోజనాలు కూడా అంతే ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కివి, పియర్ వంటి రుచి కలిగిన ఈ డ్రాగన్ ఫ్రూట్ అనేక ప్రమాదకరమైన వ్యాధులను సైతం నయం చేయడానికి ఉపయోగిస్తారు. ఇందులో ఉండే విటమిన్ సి, కెరోటిన్, ప్రొటీన్, ఫైబర్, క్యాల్షియం, ఫాస్పరస్, పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాట్, ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గుండె సహా అనేక వ్యాధులలో డ్రాగన్ ఫ్రూట్ ఉపయోగపడుతుంది.

**గుండెకు ప్రయోజనకరం..** డ్రాగన్ ఫ్రూట్ గుండెకు మేలు చేస్తుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఒమేగా 6 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. యాంటీఆక్సిడెంట్లు రక్త ప్రసరణను మెరుగుపరచడానికి పని చేస్తాయి. మెగ్నీషియం కూడా డ్రాగన్ ఫ్రూట్‌లో పుష్కలంగా ఉంటుంది. ఇది స్ట్రోక్, గుండెపోటు వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది..** గుండె సమస్యలకు ప్రధానంగా చెడు కొలెస్ట్రాల్ కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవాలి. డ్రాగన్ ఫ్రూట్‌లో ఉండే పాలీఅన్‌శాచురేటెడ్ ఫ్యాట్, ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్‌లు, ఫైబర్, యాంటీ-ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో పని చేస్తాయి. డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ కూడా పెరుగుతుంది. హృద్రోగులకు డ్రాగన్ ఫ్రూట్ తీసుకోవడం చాలా మేలు చేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది..** డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌లో మంచి మొత్తంలో నీరు కూడా ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. డీహైడ్రేషన్ కారణంగా డయేరియా వంటి సమస్యలు ఉండవు. డ్రాగన్ తీసుకోవడం వల్ల మలబద్ధకం, అజీర్ణం, కడుపు నొప్పి ఉండదు.

**రక్తహీనతలో ప్రయోజనకరం..** డ్రాగన్ ఫ్రూట్‌లో ఐరన్ పుష్కలంగా లభిస్తుంది. డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ లోపం తొలగిపోతుంది. రక్తహీనతకు డ్రాగన్ ఫ్రూట్ చాలా మేలు చేస్తుందని.. ఆ సమస్యతో బాధపడుతున్న వారు ఈ పండును తినడం మంచిదని సూచిస్తున్నారు.

**ఎముకలను దృఢంగా మారుస్తుంది..** డ్రాగన్ ఫ్రూట్ ఎముకలు, దంతాలను బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. ఇందులో ఉండే కాల్షియం, ఫాస్పరస్ ఎముకలను దృఢంగా చేస్తాయి.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది..** డ్రాగన్ ఫ్రూట్ తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇది వ్యాధులతో పోరాడే శక్తిని పెంచుతుంది.

# మంచి పుస్తకం మనిషి జీవితంలో మార్పు తెస్తుంది



**విజయనగరం:** మంచి పుస్తకాలు, మనిషి జీవితంలో గొప్ప మార్పును తీసుకువస్తాయని జెడ్‌పి ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ప్రతీఒక్కరూ పుస్తక పఠనాన్ని అవవర్చుకోవాలని కోరారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను, స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆయన సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ మాట్లాడుతూ, పిల్లలకు చదువుతోపాటు సమాజం పట్ల అవగాహన అవసరమని అన్నారు. గొప్పగొప్ప రచయితల రచనల ద్వారా, సమాజం పట్ల, వివిధ అంశాలపట్లా అవగాహన పెంచుకోవచ్చునని అన్నారు. పుస్తకాలు సమాజంలో ఎన్నో మార్పులకు దోహదం చేశాయని పేర్కొన్నారు. పుస్తక పఠనం ప్రతీఒక్కరికీ అవసరమని, మంచి పుస్తకాలను అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఎన్నో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. గ్రంథాలయాల్లో మరిన్ని మౌలిక వసతులను కల్పించి, మంచి పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. గ్రంథాలయాల అభివృద్ధికి జిల్లా పరిషత్ నుంచి తమవంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి మాట్లాడుతూ, సమాజ వికాశంలో గ్రంథాలయాల ప్రాధాన్యతను తెలియజేసేందుకు, గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలు టీవీలు, సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా, పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పెద్దవారు కూడా పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవడమే కాకుండా, పిల్లల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలని కోరారు.

బాలల దినోత్సవం సందర్భంగా, జిల్లాకు చెందిన బాల క్రీడాకారుడు, స్కేటింగ్‌లో విశేష ప్రతిభ చూపుతున్న సాయి కౌషిక్‌ను జ్ఞాపికతో సత్కరించారు. కౌషిక్‌ను అన్నివిధాలా ప్రోత్సహిస్తామని జెడ్‌పి ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిఇఓ కె.వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి ఎన్.లలిత, డాక్టర్ ఎ.గోపాలరావు, పసుమర్తి సన్యాసిరావు తదితర ప్రముఖులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బకాయిలో ఉన్న మెస్ బిల్లులు విడుదల చేయాలి



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** గిరిజన సంక్షేమ వసతీ గృహాల, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమారుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన విద్యార్థులు సంక్షేమ వసతి గృహాలలో అనేక రకాల స్థానిక సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. మెస్ బిల్లులు బకాయిలలో నిలిచిపోవడంతో విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయడానికి హాస్టల్ వార్డెనులు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, దానివలన విద్యార్థులు కూడా మానసికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

బకాయిలో ఉన్న 8 నెలల బిల్లులు వెంటనే విడుదల చేయాలని, వంట గ్యాస్ కంపెనీలకు బకాయిలు నిలిచిపోవడంతో గ్యాస్ సరఫరా అంతంత మాత్రమే అందుతుందని దాని వలన విద్యార్థులకు సకాలంలో భోజనం అందడం లేదని ఆలస్యంగా పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. వెంటనే గ్యాస్ సమస్యలు పరిష్కారం చేయాలని, పెరిగిన ధరలు కనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, కాస్మెటిక్స్ చార్జీలు ప్రతి నెల నేరుగా విద్యార్థుల చేతికి ఇవ్వాలని, పార్వతిపురం గిరిజన బాలురు, బాలికల పోస్ట్ మెట్రిక్ హాస్టలకు అదనపు భవనాలు ఏర్పాటు చేయాలని, జిల్లాలో సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు ఏర్పాటు, చేయాలని సాలూరు పోస్ట్మెట్రిక్ హాస్టల్లకు రోడ్లు సౌకర్యం కల్పించాలని, గుమ్మలక్ష్మీపురం పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో నిలిచిపోయిన డ్రైనింగ్ హాల్, మరుగుదొడ్లు, ప్రహరీ గోడ పనులు పూర్తి చేయాలని, ఖాళీగా ఉన్న కుక్, కమాటి, వాచ్మెన్, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని, ఆశ్రమ, పోస్టుమెట్రిక్ హాస్టల్లో ఏఎన్ఎంలను నియమించాలని, ఆశ్రమ, ఇంటర్, డిగ్రీ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీ చేయాలని తదితర సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని లేకుంటే భవిష్యత్తులో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.భాస్కరరావు, సిహెచ్.సింహాచలం, ఎం.ఉదయ్ కుమార్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ టెన్ని కొయిట్ పోటీలలో సత్తా చాటిన ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** హర్యానా సోనీ పట్ లో ఇటీవల జరిగిన 46వ జాతీయ సీనియర్స్ శ్రీ పురుషుల టెన్నికాయిట్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ స్త్రీల జట్టు తృతీయ స్థానాన్ని గెలుపొంది కాంస్య పతకాలను దక్కించుకుంది. సోనీపత్ శాసనసభ్యులు సురేంద్ర పవర్ చేతుల మీదుగా క్రీడాకారులు కాంస్య పతకం అందుకున్నారు. ఆంధ్ర రాష్ట్రం విభజన అనంతరం మొట్టమొదటి సారిగా ఆంధ్రప్రదేశ్ జట్టు ఈ విజయాన్ని కైవశం చేసుకుంది . సీనియర్ విభాగంలో పతకం సాధించడం చాలా ఆనందంగా ఉంది అని ఆంధ్రప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు వైడి రామారావు, చైర్మన్ పి జి వి ఆర్ నాయుడు (గణబాబు) క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఈ విజయం వెనక క్రీడాకారుల కృషికి జాతీయ టెన్నికాయిట్ సమైక్య ప్రధాన కార్యదర్శి ఏ యాదయ్య, సీఈవో బి ఎస్ నాగరాజు క్రీడాకారులను కోచ్ మేనేజర్లను అభినందించారు, ఈ సందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులను రాష్ట్ర కార్యదర్శి కే ఎన్ వి సత్యనారాయణ అభినందిస్తూ కోచ్ ల కృషిని కొనియాడారు. క్రీడాకారులు ఆర్ మౌనిక, జి హేమామాదిరి, ఎం ప్రవల్లిక, పి రేణుక, ఎస్ పల్లవి శ్వేతాశ్రీ, జి శ్రావణి పాల్గొని విజయం సాధించారు. ఈ సందర్భంగా కోచ్ జి రాజు, మేనేజర్ వై అలేఖ్య, జాతీయ రెఫరీలు ఎం లక్ష్మణరావు (అంతర్జాతీయ టెన్నికాయిట్ క్రీడాకారుడు) కే రమేష్ పాల్గొన్నారు అని కే ఎన్ వి తెలిపారు.

# జ్ఞానాన్ని అందించే కేంద్రాలు గ్రంధాలయాలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా గ్రంధాలయాలు నిలుస్తాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం ఏయూ డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంధాలయంలో గ్రంధాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళపత్రాలలో ఉన్న జ్ఞాన సంపదను పరిరక్షించే ప్రాజెక్టును విజయవంతంగా పూర్తిచేయడం హర్షణీయమన్నారు. అదే విధంగా పీహెచ్‌డి థీసిస్‌లు డిజిటలైజేషన్ చేసి శోధ్‌గంగ వెబ్‌సైట్‌లో ఉంచడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో దీనిలో ఏయూకు 9వ ర్యాంక్ లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే సంవత్సరం నాక్ నిపుణుల బృందం ఏయూను సందర్శిస్తుందని, దీనికి అనుగుణంగా గ్రంధాలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతికతను మేళవిస్తూ విద్యార్థులకు మరింత చేరువగా గ్రంధాలయ సేవలను తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. ఏయూ విద్యార్థులకు సివిల్స్‌కు సిద్ధమయ్యే విధంగా వారికి అవసరమైన శిక్షణ అందించే ఆలోచన ఉందన్నారు. వనరులను పూర్తిస్తాయిలో సద్వినియోగం చేస్తూ ఈ కంటెంట్‌ను విద్యార్థులకు అందుబాటులో ఉంచడం జరగుతుందన్నారు.

గత రెండు సంవత్సరాలుగా డాక్టర్ వి.ఎస్.కృష్ణా గ్రంధాలయంలో జరుగుతున్న అభివృద్ధిని గ్రంధాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు వివరించారు.

కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్స్ ఆచార్య వి.విజయలక్ష్మి, ఎస్.కె భట్టి, టి.శోభశ్రీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అరుదైన పుస్తకాల ప్రదర్శనను వీసీ ప్రారంభించి తిలకించారు.

# దేశ రాజధాని ఢిల్లీలో దారుణం.. యువతిని దారుణ హత్య

## 35 ముక్కలుగా కట్ చేసి ఢిల్లీ అంతా విసిరికొట్టారు



న్యూ ఢిల్లీ నవంబర్ 14 (ఎక్స్ప్రెస్ న్యూస్ )బీదేశ రాజధాని ఢిల్లీలో దారుణం వెలుగుచూసింది. ఒక యువతిని హత్య చేసి 35 ముక్కలుగా కట్ చేసి ఢిల్లీ అంతా విసిరికొట్టారు. ఇంతటి దారుణ హత్య కేసు విచారణ సమయంలో విస్తుపోయే వాస్తవాలు బయటకు వచ్చాయి. మృతురాలు శ్రద్ధా (26) ముంబైలోని ప్రముఖ సంస్థ కాల్ సెంటర్ లో పనిచేసేది ఆమెను అఫ్తాబ్ అమీన్ పూనావాలా ఇలా హత్య చేసినట్టు విచారణలో తేలింది.శ్రద్ధకు అఫ్తాబ్ అమీన్ పూలావాలతో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారి.. ఇద్దరూ సహజీవనం చేసే వరకూ సాగింది. అయితే వారి బంధాన్ని ఇంట్లో పెద్దలు అంగీకరించలేదు. దాంతో వారు ముంబై నుంచి ఢిల్లీకి పారిపోయి మెహ్రౌలీలో ఒక ఫ్లాట్ లో ఉండేవారు. కానీ వారి మధ్య పెళ్లి గురించి గొడవలు జరుగుతుండేవి.అవి ఒక రోజు తీవ్రరూపం దాల్చి ఇద్దరూ ఘర్షణకు దిగారు. ఈ క్రమంలోనే శ్రద్ధను అమీన్ హత్య చేశాడు. మే 18న ఈ ఘటన జరిగింది. తర్వాత ఆ హత్యను దాచిపెట్టేందుకు అమీన్ వ్యవహరించిన తీరు విన్న పోలీసులు షాక్ కు గురయ్యారు.శ్రద్ధ మృతదేహాన్ని 35 ముక్కలు చేసి.. వాటిని ఫ్రిడ్జ్ లో పెట్టారు. 18 రోజుల పాటు అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో వాటిని విసిరేశారు. అలా ఆ మృతదేహం జాడ లేకుండా చేశారు.శ్రద్ధ ఫోన్ ఎత్తకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులకు అనుమానం మొదలైంది. నవంబర్ 8న ఆమె తండ్రి ఢిల్లీలోని వారి ఇంటికి వచ్చాడు. కానీ ఆ ఫ్లాట్ కు తాళం వేసి ఉంది.దాంతో అతడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాని ఆధారంగా శనివారం అమీన్ ను అరెస్ట్ చేశారు. శ్రద్ధ తనను పదే పదే పెళ్లి చేసుకోవాలని కోరడం వల్లే తమ మధ్య గొడవలు జరిగేవని అమీన్ విచారణలో వెల్లడించాడు. ప్రస్తుతం ఈ ఖేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# పిఠాపురం భాష్యం పాఠశాలలో బాలల దినోత్సవం




**పిఠాపురం, (విశాఖ సమాచారమ్):** భాష్యం పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ప్రథమ ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ గారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరము బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ పోలుపర్తి వేణు గారు తెలియజేశారు..

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో వివిధ Gamesలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పాఠశాల ప్రైమరీ హెచ్ఎం శ్రీమతి అరుణ గారు మాట్లాడుతూ జీవితంలో బాల్య దశ అత్యంత కీలకమైనదని విద్యతోపాటు వినోదం కూడా జీవితంలో భాగమవాలని అందుకోసమే ఈ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు., విద్యార్థినీ విద్యార్థులు వివిధ వేషధారణలతో నృత్యాలతో అలరించారు. విద్యార్థినీ విద్యార్థులకు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ శ్రీ భాష్యం రామకృష్ణ విద్యాసంస్థల జోనల్ బాధ్యుడు వి గోవిందరాజు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పోలుపర్తి వేణు ప్రైమరీ హెచ్ఎం అరుణ మరియు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులు అందరు ఒక్కటై ప్రతిపక్షాల ఆరోపణలు తిప్పికొట్టారు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** లబ్ధిదారులు అందరు ఒక్కటై ప్రతి పక్షాల ఆరోపణలు తిప్పికొట్టారని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు.బాలల దినోత్సవ సందర్భంగా మంగళగిరిలో టిడ్కో గృహ సముదాయాల మధ్య లబ్ధిదారులు వారి పిల్లలతో జరిగిన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.ఏ.పి.టిడ్కో చైర్మెన్.జమ్మాన ప్రసన్న కుమార్ ఏ.పి.టిడ్కోద్వారా ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు వారి సొంత ఇళ్లను అందించిన తరువాత వారి యోగ క్షేమములు వారికి అందుతున్నటు వంటి మౌళిక సదుపాయాలు గురుంచి తెలుసుకొనే క్రమములో మరొకమారు టిడ్కో ఇంజనీర్లు మునిసిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. ముందుగా సొంత ఇంటి కళ నెరవేరిన లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులందరూ కలిసి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి కి ఆజన్మాంతం ఋణపడి ఉంటామని వారికి మా యొక్క ప్రత్యేక కృతజ్ఞతలు అని చైర్మెన్ తెలియజేస్తూ మరలా ఈ ఆంధ్రప్రదేశ్ కు రాబోయే రోజులలో వారే ముఖ్యమంత్రి గా ఉండాలని ఆశిస్తున్నామని చెప్పారు.బాలల దినోత్సవం సందర్భముగా టిడ్కో లబ్ధిదారుల పిల్లలు అందరూ కలిసి ఆనందముగా, ఉత్సహంగా ఆట పాటలతో సందడి చేస్తూ చక్కటి మంచి వాతావరణములో గొప్ప ఇళ్లను అందించిన ముఖ్యమంత్రి,అనేక సంక్షేమ కార్యక్రమాల వారధి, ముద్దుగా పిలుచుకునే మా జగన్ మామయ్య కు బాలల దినోత్సవం సందర్భంగా థాంక్ యూ జగన్ మామ అని ఎంతో సంతోషిస్తున్నామని ఆనందముగా చెప్పడం జరిగింది. చైర్మెన్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం మాత్రమే పనిచేసే ప్రభుత్వం కనుక ఎవ్వరూ అధైర్యపడవద్దని మీకు అండగా అన్ని విధాలగా ప్రభుత్వం ప్రజా ప్రతినిధులనుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని పేదలు అందరికి సొంత ఇంటి కల నెరవేరుస్తూ పేదల ప్రజల అభిమానం చూరగొన్న ప్రభుత్వమునకు అప్రతిష్ఠ తెచ్చే విధముగా పనిచేస్తున్న ప్రతిపక్ష నాయకులకు తగిన గుణపాఠం చెప్పడం అందరి బాధ్యత అని గుర్తు చేస్తూ వారికి భరోసా ఇచ్చారు. అహర్నిశలు అభివృద్ధి సంక్షేమం కోసం పనిచేసే ముఖ్యమంత్రి కి ప్రభుత్వం నకు అన్ని వేళలా అందరూ అండగా నిలవాలని చైర్మన్ లబ్ధిదారులను కోరారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీమతి నాగేశ్వరమ్మ సూపరింటెండెంట్ ఇంజనీర్ చిన కోటేశ్వర రావు, ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాదరావు డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటాద్రి సి. ఎల్.టి.సి.ప్రభురాని కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర విభజన, రాజధాని కేసులను విడివిడిగానే విచారిస్తాం

**ఢిల్లీ:** అమరావతి రాష్ట్ర విభజన పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 28కి వాయిదా వేసింది. అమరావతిపై 8, రాష్ట్ర విభజనపై 28 పిటిషన్లు దాఖలయ్యాయి. రాష్ట్ర విభజన, అమరావతి రాజధాని కేసులను విడివిడిగానే విచారిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. 2 కేసులను విడివిడిగా విచారించాలని ప్రభుత్వం తరపున కోరామని సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మనుసింఘ్వీ, మాజీ ఏజీ వేణుగోపాల్ తెలిపారు. హైకోర్టులో అమరావతి రైతులు వేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లను కేకే వేణుగోపాల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సుప్రీంకోర్టులో విచారణ పూర్తయ్యేవరకు హైకోర్టులో ధిక్కార పిటిషన్లపై రైతులు ఒత్తిడి తేకపోవచ్చని ధర్మాసనం తెలిపింది. రాజధానిని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్న హైకోర్టు తీర్పును ప్రభుత్వ న్యాయవాది వైద్యనాథన్ చదివి వినిపించారు. ఏపీ హైకోర్టు తీర్పుపై స్టే విధించాలని కోరినట్లు న్యాయవాది వైద్యనాథన్ పేర్కొన్నారు. 28న అన్ని అంశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

# స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావుకి ఘన సన్మానం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా, వుడా, చిల్డ్రన్స్ థియేటర్లో, నవంబర్ 14 చిల్డ్రన్స్ డే ని పురస్కరించుకొని, శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావుని, 114 సార్లు రక్తదానం చేసి, చుట్టుపక్కల పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన అందిస్తూ, సంస్థ ఏర్పాటు దగ్గర నుంచి నిత్యా అన్నదానాన్ని నిర్వహిస్తూ అనాధ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ, అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సూరాడ. అప్పారావుని, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, రాష్ట్ర మంత్రి వర్యులు, గుడివాడ అమర్నాథ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీమతి కొండా రమాదేవి, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి. గణేష్ కుమార్ గారు, తిప్పల .నాగిరెడ్డి, Y.S.R.C.P. నేత కొండ రాజీవ్ గాంధీ సమక్షంలో, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షులు సూరడ. అప్పారావు గారిని ఘనంగా సత్కరించారు.




# మంత్రి బొత్స సత్యనారాయణ నేడు జిల్లాకు రాక



**విజయనగరం:** రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శ్రీ బొత్స సత్యనారాయణ మంగళవారం ఉదయం జిల్లాకు వస్తున్నారు. మంత్రి మంగళవారం ఉదయం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని తన నివాసానికి చేరుకుంటారు. ఉదయం 10-30 గంటలకు గరివిడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3-00 గంటలకు విజయనగరంలో బయలుదేరి విశాఖ మీదుగా సాయంత్రం కు విజయవాడ చేరుకుంటారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345,
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999.